ఈనాడు
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం అక్టోబరు 22, 2024 5

ఉచిత గ్యాస్ ఆశలు.. ఈ-కేవైసీకి బారులు



దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో గ్యాస్ సరఫరా చేసే సంస్థల వద్ద ఈ-కేవైసీ చేయించుకునేందుకు లబ్ధిదారులు బారులుదీరుతున్నారు. కాట్రేనికోనలోని ఇండెన్ గ్యాస్ కార్యాలయానికి సోమవారం పెద్దఎత్తున మహిళలు తరలివచ్చారు. –న్యూస్‌టుడే, కాట్రేనికోన

1008 కలశాలతో గ్రామోత్సవం



సఖినేటిపల్లి మండలం మోరి గ్రామంలోని మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఆవరణలో సోమవారం రాత్రి అయ్యప్పస్వామి 1008 కలశ పూజ వైభవంగా నిర్వహించారు. స్థానిక పేరాబత్తుల సుబ్బారాయుడు గురుస్వామి పీఠం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వీరంతా తరలివచ్చారు. కలశాలు తలపై పెట్టుకుని మోరి నుంచి వీవీమెరక, గాంధీనగర్, మలికిపురం కూడలి మీదుగా గ్రామోత్సవం నిర్వహించారు.
-న్యూస్‌టుడే, అంతర్వేది

ప్రాథమిక విద్యకు పూర్వ వైభవం



జీవో 117 రద్దు నిర్ణయంపై సర్వత్రా హర్షం

న్యూస్‌టుడే, పామర్రు

విద్య పునర్ వ్యవస్థీకరణ పేరిట వైకాపా సర్కారు తెచ్చిన జీవో 117తో విద్యారంగం కుదేలైంది. సర్కారు అనాలోచిత చర్యలతో ముఖ్యంగా ప్రాథమిక విద్య విధ్వంసానికి గురైంది. ప్రాథమిక పాఠశాలలు కళావిహీనంగా మారాయి. ఈ పరిస్థితి చక్కదిద్దాలని ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రుల వినతి మేరకు కూటమి సర్కారు చర్యలు చేపట్టడంతో అంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

10+2 విద్య నిర్మాణ స్థానంలో 5+3+3+4 విద్యావిధానాన్ని (ఎన్‌ఈపీ) తీసుకొచ్చింది. దీనికోసం వైకాపా సర్కారు జీవో 117తో 3, 4, 5 తరగతులను విలీన ప్రక్రియ చేపట్టింది. ఉమ్మడి జిల్లాలో 368 పాఠశాలల్లో 1, 2 తరగతులు మాత్రమే మిగిలిపోయాయి. 3, 4, 5 తరగతులవారు ఉన్నత పాఠశాలలకు వెళ్లాలంటే దూరాభారంతో ఇబ్బందిపడ్డారు. సుమారు 910 మంది విద్యార్థులు డ్రాపౌట్లుగా మిగిలిపోయారు. 3, 4, 5 తరగతుల వారికి స్కూల్ అసిస్టెంట్లతోనే బోధన చేయిస్తామని వైకాపా సర్కారు ప్రగల్భాలు పలికింది. ఉమ్మడి జిల్లాలో 1,215 వరకూ టీచర్లను సర్దుబాటు చేయాల్సి వచ్చింది. దీంతో గందరగోళం తలెత్తింది. ప్రాథమిక పాఠశాలల్లో ఏకోపాధ్యాయ బడుల సంఖ్య బాగా పెరిగిపోయింది.

● విలీనంతో ఎన్నో అవస్థలు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 368 ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను సమీపంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో గత సర్కారు విలీనం చేసింది. దీనివల్ల సుమారు 911 పాఠశాలల్లో పది మందిలోపే విద్యార్థులు మిగిలారు. 126 పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఒక్కరూ చేరలేదు. సున్నా సంఖ్య ఉన్న పాఠశాలలు ఉమ్మడి జిల్లాలో 15 వరకూ ఉన్నాయి.

● ఇచ్చిన హామీ నెరవేర్చి..

అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో 117 రద్దు చేస్తామని కూటమి నాయకులు హామీఇచ్చారు. చెప్పినట్టే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్.. ఈ జీవోను వచ్చే విద్యాసంవత్సరం నుంచి రద్దు చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.

● ఇదీ ప్రయోజనం

◆ జీవో 117 రద్దుతో ప్రాథమిక పాఠశాలలకు పూర్వ వైభవం వస్తుంది. ◆ విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల నియామకానికి జీవో 53 అమలవుతుంది. ◆ 98 మంది కంటే తక్కువ రోల్ ఉన్న ఉన్నత పాఠశాలలకు జీవం వస్తుంది. ప్రాథమికోన్నత పాఠశాలలకు సబ్జెక్టులవారీ ఉపాధ్యాయులు వస్తారు.

చాలా మంచి నిర్ణయం



జీవో 117 రద్దు చేయాలని యూటీఎఫ్ ప్రత్యక్ష ఆందోళనలు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేసింది. ఎట్టకేలకు ప్రభుత్వం మంచి నిర్ణయాన్ని ప్రకటించింది.
- మాగాపు ప్రదీప్‌కుమార్, యూటీఎఫ్ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి

వెంకన్న బ్రహ్మోత్సవం.. భక్తజన సంబరం



వేంకటేశ్వరస్వామి శేషవాహన సేవలో భక్తులు





కళాకారుల డప్పు వాయిద్యం

కాంతులీనుతున్న వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: గోవింద నామస్మరణలు మిన్నంటిన వేళ వాడపల్లి వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. పండితులు ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు నేతృత్వంలో అంకురార్పణ చేశారు. శుభముహూర్తంలో ధ్వజారోహణ నిర్వహించారు. గరుడ పటాన్ని ఊరేగించి బ్రహ్మాది దేవతలను ఉత్సవాలకు ఆహ్వానిస్తూ శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి సమక్షంలో ఎగురవేశారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు తదితరులు మూలమూర్తికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఏడు పడగల ఆదిశేషునిపై రాత్రి ఉభయ దేవేరులతో పరావాసుదేవ అలంకారంలో స్వామి ఊరేగారు. ● మంగళవారం అష్టదళ పాదపద్మారాధన, సరస్వతి అలంకరణలో హంసవాహన సేవ ఉంటాయి.

దళిత యువకుడి హత్యకేసులో.. మాజీ మంత్రి విశ్వరూప్ కుమారుడు అరెస్టు

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే: అమలాపురం పట్టణం, పి.గన్నవరం: అయినవిల్లికి చెందిన వాలంటీరు జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య(2022 జూన్ 6) కేసులో సూత్రధారైన మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్‌ను మధురైలో ఆదివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తిరువణ్ణామలైలో ఉన్నట్లు తెలియడంతో పోలీసులు అక్కడికి చేరుకోగా.. శ్రీకాంత్ పరారై మధురై చేరుకున్నట్లు సమాచారం. అక్కడ పట్టుకున్నట్లు తెలుస్తోంది. 'నేనో డాక్టర్‌ను.. ప్రాణాలు కాపాడడమే గాని.. తీయడం రాదు.. అక్రమంగా ఇరికిస్తున్నారంటూ శ్రీకాంత్ వ్యాఖ్యానించారు. వైద్య పరీక్షలు నిర్వహించి, సోమవారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి, రోడ్డు మార్గంలో ఇక్కడకు తీసుకొస్తున్నారు. ■ ముమ్మిడివరానికి చెందిన వైకాపా నాయకుడు కాశీ రామకృష్ణ, మరో ముగ్గురినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్య కేసు నిందితులతో ఎక్కువగా ఫోన్లో మాట్లాడినట్లు గుర్తించిన నేపథ్యంలో విచారిస్తున్నట్లు తెలుస్తోంది.



అక్రమంగా తనను ఇరికిస్తున్నారంటూ మధురైలో వ్యాఖ్యానిస్తున్న శ్రీకాంత్

సాగునీటి సంఘాలకు పచ్చజెండా

ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే, ముమ్మిడివరం, పి.గన్నవరం: అయిదేళ్ల వైకాపా పాలనలో గాలికొదిలేసిన సాగునీటి పారుదల వ్యవస్థను గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆయా ఆయకట్టు పరిధిలో కాలువల నిర్వహణ, ఇతర బాధ్యతల పర్యవేక్షణలో కీలకంగా వ్యవహరించే సంఘాల ఎన్నికల నిర్వహణకు పచ్చజెండా ఊపింది. తూర్పుగోదావరి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల కలెక్టర్లు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారని జలవనరులశాఖ ఎస్ఈ శ్రీనివాసరావు తెలిపారు.

ప్రక్రియ ఇలా..

కాలువల ఆయకట్టు ఆధారంగా ప్రాదేశిక (టెరిటోరియల్) నియోజకవర్గాల వారీ ఆయకట్టు నిర్ధారణ, ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి.. 12 టీసీలను ఎన్నుకుంటారు. వీరిలోనే సాగునీటి వినియోగదారుల సంఘానికి (డబ్ల్యుయూఏ) అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకుంటారు. డబ్ల్యుయూఏలు డీసీలు (డిస్ట్రిబ్యూటరీ కమిటీ), డీసీలు ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకుంటాయి. గతంలో గోదావరి డెల్టా పరిధిలో ఒకటే ప్రాజెక్టు కమిటీ ఉండేది. ప్రస్తుతం తూర్పు, మధ్య డెల్టాలకు వేర్వేరుగా కమిటీల ఎన్నిక జరగనుంది.

ఇదీ పరిస్థితి..

ఉమ్మడి జిల్లాలో గోదావరి డెల్టా సిస్టమ్, ఏలేరు ఇరిగేషన్ (వైఐ) డివిజన్, ఏలేరు ప్రాజెక్టు, తొర్రిగడ్డ పంపింగ్ స్కీం, పంపా రిజర్వాయర్, సుబ్బారెడ్డి సాగర్, మైనర్ ఇరిగేషన్ పరిధిలో 401 సాగునీటి సంఘాలు, 30 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు (డీసీ), 5 ప్రాజెక్టు కమిటీలు (పీసీ) ఉన్నాయి.

గోదావరి డెల్టా సిస్టమ్ (జీడీఓస్):	▶ మధ్య డెల్టాలో సాగునీటి వినియోగదారుల సంఘాలు (డబ్ల్యుయూఏ): 56
తూర్పు డెల్టా	▶ 74 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు (డీసీ): 25 ▶ ప్రాజెక్టు కమిటీలు: 2
ఏలేరు ప్రాజెక్టు	▶ సంఘాలు: 25 ▶ డిస్ట్రిబ్యూటరీ కమిటీలు: 5 ▶ ప్రాజెక్టు కమిటీ: 1
తొర్రిగడ్డ పంపింగ్ పథకం	▶ వినియోగదారుల సంఘాలు: 04 ▶ ప్రాజెక్టు కమిటీ: 01
పంపా రిజర్వాయర్	▶ సంఘాలు: 06 ▶ ప్రాజెక్టు కమిటీ: 01
సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు	▶ సంఘాలు: 06 ▶ ప్రాజెక్టు కమిటీ: 01
సూక్ష్మ నీటిపారుదల వ్యవస్థ	▶ సంఘాలు: 216 ఏలేరు నీటిపారుదల డివిజన్ (పెద్దాపురం): ▶ సంఘాలు: 14

అధికారుల నియామకానికి చర్యలు

ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి మండలానికి డిప్యూటీ తహసీల్దార్లు అధీకృత అధికారులుగా వ్యవహరిస్తారు. ఎన్నికల అధికారులుగా జలవనరులశాఖ ఇంజినీర్లను నియమించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. పోలింగ్, అసిస్టెంట్ పోలింగ్ అధికారులుగా సచివాలయ సిబ్బంది ఉంటారు. ధవళేశ్వరం సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రైతేరాజు
అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

పోలీసుల సేవలు అమూల్యం



కార్యక్రమంలో కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు, రాజ్యసభ సభ్యుడు సుభాష్‌చంద్రబోస్

అమలాపురం పట్టణం: శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసుల సేవలు అమూల్యమని కలెక్టర్ మహేష్‌కుమార్ కొనియాడారు. అమలాపురంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో సోమవారం పోలీస్ అమరవీరుల దినం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎండావాన, పగలూ రాత్రి తేడా లేకుండా పోలీసు విధులు నిర్వహిస్తారన్నారు. వివిధ హోదాలో పనిచేస్తూ అమరులైన బి.రామచంద్రరావు, పి.సుబ్బారెడ్డి, వి.సత్యసాయిబాబా, టి.బాలాజీరాజు, కె.ఏడుకొండలకు నివాళి అర్పించారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, రెండవ అదనపు న్యాయమూర్తి వి.నరేష్, ఏఎస్పీ ప్రసాద్, డీఎస్పీ ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ విజయసారథి పాల్గొన్నారు.

మా అమ్మాయిని ఏం చేశాడో..?

అమలాపురం పట్టణం: ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. 21 మంది ఎస్పీ బి.కృష్ణారావుకు వినతులు అందజేశారు. తమ కుమార్తె 20 రోజుల నుంచి కనిపించడం లేదని పల్లం గ్రామానికి చెందిన ఒక మహిళ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ఓ వ్యక్తి ఇప్పటికే ఓ యువతిని వివాహం చేసుకున్నాడని, ఆమె ఆచూకీ లభించడం లేదన్నారు. తాజాగా తమ కుమార్తెను తీసుకువెళ్లిపోయాడని వాపోయారు. కంటికి రెప్పలాపెంచుకున్న తమ కుమార్తెను ఏం చేశాడో తెలియడం లేదని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. కొందరు నాయకులు అతడికి అండగా ఉన్నారని ఆమె ఆరోపించారు.

ఆత్మహత్య చేసుకున్నా.. అప్పుతీర్చడం లేదు..

తన తమ్ముడు మంగళంపల్లి రవికుమార్‌ను ఇద్దరు వ్యక్తులు మోసం చేశారని అమలాపురం కె.అగ్రహారానికి చెందిన మహిళ ఫిర్యాదు చేశారు. వేరే చోట అప్పుచేసి ఇద్దరికి ఇవ్వగా వారు తిరిగి తీర్చలేదన్నారు. తన తమ్ముడు ఈ ఏడాది మే నెలలో ఆత్మహత్య చేసుకున్నాడని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. తన కొడుకుకైనా ఆ డబ్బులు ఇవ్వాలని రవికుమార్ చీటీ రాసి ఆత్మహత్య చేసుకున్నాడని ఆమె ఫిర్యాదు చేశారు. వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయలేదని వాపోయారు.

6 నెలల్లో ఆకాశంలోకి..

పెరిగిన జీడిపప్పు ధరలు

జీడిపప్పు ధరలు ఆకాశాన్నంటాయి. ప్రస్తుతం కేజీ రూ.850 పైబడి పలుకుతోంది. మలికిపురం మండలం మోరి ఈ పప్పు తయారీకి ప్రసిద్ధి. వీరికి అవసరమైన జీడి పిక్కలను ఉమ్మడి ఉభయ గోదావరి, విశాఖపట్నం జిల్లాల్లోని దేవరపల్లి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, అశ్వారావుపేట, తుని, నర్సీపట్నం, తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటారు. ప్రస్తుతం అక్కడ కూడా అందుబాటులో లేక ధరలు ఒక్కసారిగా పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు.
- న్యూస్‌టుడే, మలికిపురం, సఖినేటిపల్లి



తయారైన జీడిపప్పు గ్రేడింగు చేస్తున్న సిబ్బంది


కుటీర పరిశ్రమగా ప్రసిద్ధి

దశాబ్దాలుగా 'మోరి జీడిపప్పు' రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. మోరిపోడు, మోరి గ్రామాల్లో కుటీర పరిశ్రమగా సుమారు 200 కుటుంబాలు ఈ పప్పు తయారు చేస్తున్నారు. మలికిపురం, సఖినేటిపల్లి, రాజోలు, మామిడికుదురు మండలాల్లోని పలు గ్రామాల్లో గింజలను కొట్టి పప్పుతీయడం, వలిచే పనుల్లో 2 వేల మందిపైగా మహిళలు జీవనోపాధి పొందుతున్నారు. ఇక్కడి నుంచి హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం తదితర నగరాలకు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు.

జీడిపప్పునకు ప్రసిద్ధి చెందిన మలికిపురం మండలం మోరి గ్రామంలో ప్రతి సీజనులో రోజుకి 300 నుంచి 400 బస్తాల పిక్కలను కొట్టి పప్పు తయారు చేస్తారు. బస్తాకి 20 కేజీల వరకు పప్పు తయారవుతుంది. అంటే దాదాపు 6 టన్నుల నుంచి 8 టన్నుల వరకు రోజూ పప్పు తయారై మార్కెట్‌లోకి వస్తుంది. పెళ్లిళ్లు, పండగల సమయాల్లో మరింత డిమాండు ఉంటుంది. ఏప్రిల్ నెలలో కిలో రూ.500 నుంచి రూ.550 ఉన్న ధర ప్రస్తుతం రూ.850 పైబడి అమ్ముతున్నారు. ఏప్రిల్ నెల నుంచి క్రమేపీ పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం రూ.880లు కూడా అమ్ముతున్నారు.

సీజనులో 400 బస్తాల గింజలు కొడతారు

ఈ ఏడాది ఏప్రిల్ నెలలో రూ.9 వేలు ఉన్న జీడిపిక్కల బస్తా ప్రస్తుతం రూ.15 వేలు పైబడి పలుకుతోంది. ప్రస్తుతం జీడి పిక్కలు లేక పోవడంతో ధరలు పెరిగాయని, వచ్చే మార్చి నెలాఖరుకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని తయారీదారులు చెబుతున్నారు. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే జీడి పిక్కలు నాణ్యత తక్కువగా ఉండి దిగుబడి తక్కువగా వస్తుందని అంటున్నారు.



హరిత శాల



కపిలేశ్వరపురం మండలం నిడసనమెట్టకు చెందిన పాడిరైతు వి.సత్యనారాయణ పశువుల కోసం రేకులతో చిన్న శాల నిర్మించారు. గతేడాది వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా మూగజీవాలు ఇబ్బంది పడటం గమనించి, వాటి కోసం శాలకు రెండు వైపులా తీగజాతి మొక్కలు నాటారు. అవి ఏపుగా పెరిగి శాల మొత్తం విస్తరించడంతో పచ్చదనంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. అందులో ఉన్న పశువులకు వేసవిలో చల్లగా, శీతాకాలంలో వెచ్చగా ఉంటుందని రైతు తెలిపారు. - న్యూస్‌టుడే, అంగర

దరఖాస్తు గడువు పెంపు

యానాం, న్యూస్‌టుడే: యానాంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో చేరికకు ఈనెల 30వ తేదీ వరకు గడువు పెంచినట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ చింతపల్లి సుధాకర్ తెలిపారు. ఆసక్తి కలిగిన యువకులు వివిధ ట్రేడుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన సూచించారు.

తూర్పుపాలెంలో కోకో పార్కు

మలికిపురం, న్యూస్‌టుడే: మలికిపురం మండలం తూర్పుపాలెంలో కోకో పార్కు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వపరంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం 25 ఎకరాల భూమిని సేకరించడానికి కార్యాచరణ చేపట్టామన్నారు. కోనసీమ జిల్లాలో 1.10 లక్షల ఎకరాల కొబ్బరి తోటలు విస్తరించి సంవత్సరానికి 39 కోట్ల కాయలు ఉత్పత్తవుతున్న క్రమంలో వాటికి సంబంధించి నాలుగు భాగాలతో పది రకాల కొబ్బరి ఉత్పత్తులను తీయొచ్చన్నారు. దీనికి తూర్పుపాలెం అనువైన ప్రాంతంగా గుర్తించి ఇక్కడ కోకో పార్క్ ఏర్పాటు చేయడానికి అధికారులతో చర్చించనున్నట్లు వెల్లడించారు.



ఇచ్ఛాపురం అల్ట్రాడీలక్స్ కొత్త బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

విద్యార్థులకు అనుకూలంగా బస్సుల ఏర్పాటు: మంత్రి సుభాష్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం నుంచి చుట్టు పక్కల గ్రామాలకు విద్యార్థుల సౌకర్యార్థం వారి విద్యాభివృద్ధికి సౌకర్యవంతంగా ఉండేలా ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులను నడిపేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సోమవారం రామచంద్రపురం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో రామచంద్రపురం నుంచి విశాఖపట్నం మీదుగా ఇచ్ఛాపురం వెళ్లేందుకు అల్ట్రా డీలక్స్ బస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రామచంద్రపురం నుంచి భద్రాచలం ఆర్టీసీ బస్సులు నడపాలని ప్రజల నుంచి అర్జీలు వస్తున్నాయని సంబంధిత విషయాన్ని ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సర్వీసును ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సుదూర ప్రాంతాలకు బస్సు సర్వీసులు పెంచేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీటీవో శ్రీనివాసరావు, డీఎం పి.భాస్కరరావు, విజిలెన్స్ అధికారి రామారావు, ఏఎంఎస్ రవిబాబు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

బీమా పరిహారానికి.. ఇంకా ఎన్నాళ్లు..?

మిగ్-జాం తుపాను బాధిత రైతుల ఎదురుచూపులు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

గత ఏడాది ఖరీఫ్ పంట మాసూళ్ల చివరి దశలో మిగ్‌జాం తుపాను సృష్టించిన విలయానికి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. డిసెంబరు మొదటి వారంలో సంభవించిన తుపాను ప్రభావంతో వేల ఎకరాల్లో వరి, ఇతర ఉద్యాన పంటలు నీట మునిగి పాడయ్యాయి. అప్పటి వైకాపా ప్రభుత్వం రైతులకు పెట్టుబడి రాయితీ పంపిణీకి తీవ్ర జాప్యం చేసింది. మరో వైపు పంటలను నష్టపోయి ఏడాది గడుస్తున్నా.. నేటికీ బీమా పరిహారం అందలేదు.

రూ.80 కోట్లకు పైగా నష్టం..

జిల్లాలో గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో తుపాను కారణంగా 21,008 ఎకరాల్లో వరి పంట నీటమునిగి రూ.80 కోట్లకు పైగా రైతులకు నష్టం వాటిల్లింది. అరటి, కూరగాయలు, బొప్పాయి, పసుపు, తమలపాకులు తదితర పంటలు 1162 హెక్టార్లలో దెబ్బతిన్నాయి. రూ.15 కోట్లకు పైగా రైతులు నష్టపోయారు. వరి పంట నష్టపోయిన 19,849 మంది రైతులకు పెట్టుబడి రాయితీ రూ.17.85 కోట్లు, ఉద్యాన పంటలకు 1162.843 హెక్టార్లలో నష్టం వాటిల్లగా.. 3530 మందికి రూ.2,39,69,411 పెట్టుబడి రాయితీకి ప్రతిపాదనలు పంపారు. అప్పటి ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు ఈ నిధులను విడుదల చేసింది. ఇంకా కొంత మంది రైతులకు పెట్టుబడి రాయితీ సొమ్ములు ఖాతాల్లో పడలేదు.



గత ఏడాది ఖరీఫ్‌లో కురిసిన వర్షాలకు నీట మునిగిన ధాన్యం గట్టుకు తెస్తున్న రైతులు (పాత చిత్రం)

జిల్లా వివరాలు ఇలా..

- గత ఖరీఫ్‌లో వరిసాగు విస్తీర్ణం: 1.74 లక్షల ఎకరాలు
- నష్టం విలువ: రూ.80 కోట్లు
- తుపానుకు నష్టపోయిన పంట: 21,008 ఎకరాలు
- రైతులు కోల్పోయిన దిగుబడి: 39,390 టన్నులు

బీమా పరిహారం సంగతేంటి..?

గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అప్పటి ప్రభుత్వం పంటల బీమా ప్రీమియం చెల్లించిందా..? లేదా అనే దానిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. తుపాను తర్వాత వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పంట నష్టం అంచనాలు రూపొందించారు. పంట కోత ప్రయోగాలు అప్పటికే పూర్తికావడం.. అవి మరోసారి తీసే అవకాశాలు లేకపోవడంతో నష్టపోయిన పంటలకు బీమా పరిహారంలో సాంకేతిక ఇబ్బందులు ఏర్పడినట్లు తెలుస్తోంది.

ఇంకా స్పష్టత రాలేదు..

మిగ్-జాం తుపాను కారణంగా నష్టపోయిన రైతులకు పెట్టుబడి రాయితీ.. చాలా మంది రైతుల ఖాతాలకు జమ చేశారు. బీమా పరిహారం విషయంలో ఇంకా స్పష్టత లేదు. జిల్లాలో 21వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. పంటల బీమా పరిహారంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. -వి.బోసుబాబు, జిల్లా వ్యవసాయాధికారి

బలమైన అభ్యసనతో పునాది వేయాలి

కొండగుంటూరు (రాజానగరం): ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు బలమైన అభ్యసనంతో పునాది వేయడం ద్వారా విద్యాభివృద్ధి సాధ్యం అవుతుందని సమగ్రశిక్షా అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సుభాషిణి, బొమ్మూరు డైట్ ప్రిన్సిపల్ జయశ్రీ అన్నారు. రాజానగరం మండలంలోని కొండగుంటూరులో గల సత్యసాయి పరిమళ పాలిటెక్నిక్ కళాశాలలో ఒకటో తరగతి ఉపాధ్యాయులకు ఆరు రోజుల రెసిడెన్షియల్ ట్రైనింగ్ సమావేశాన్ని సోమవారం వారు ప్రారంభించారు. రాష్ట్ర పరిశీలకుడు బాలకృష్ణ మాట్లాడుతూ తూర్పుగోదావరి, కాకినాడ, డా.బీ.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులందరికీ 14 బ్యాచ్‌లుగా శిక్షణ ఉంటుందన్నారు. సమావేశంలో సమగ్రశిక్ష కాకినాడ, కోనసీమ ఏఎంఓలు రామారెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.


ఉపాధ్యాయురాలికి కిట్ అందజేస్తున్న సుభాషిణి

సరకుల నాణ్యతలో జాగ్రత్తలు తీసుకోండి

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో నిత్యాన్నదాన పథకం, ప్రసాదం తయారీ, ఇతర వాటికి కొనుగోలు చేసే సరకుల నాణ్యత విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. కలెక్టర్‌ను ఈవో రామచంద్రమోహన్ సోమవారం కాకినాడలో కలిశారు. పలు అంశాలపై చర్చించారు. బెల్లంలో సుక్రోజు (తీపి మూలకం) తక్కువగా ఉండటంపై కలెక్టర్ ఆరా తీశారు. బెల్లం కేవలం నిత్యాన్నదానంలో సాంబారు తయారీకి మాత్రమే వినియోగిస్తామని వివరించారు. సత్యదేవుని ప్రసాదం తయారీకి విజయవాడలోని విజయ డెయిరీ నెయ్యి వినియోగిస్తున్నామన్నారు. ఇతర సరకుల నాణ్యత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.

నంబరు ప్లేటు.. నచ్చినట్లు రాస్తే కుదరదు!

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నేరవార్తలు

మీ వాహనానికి నంబరు ప్లేటు సరిగా లేకుంటే జరిమానా కట్టాల్సిందే. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పోలీసు, రవాణా శాఖల అధికారులు స్పష్టం చేస్తున్నారు. పలువురు చోదకులు నంబరు ప్లేట్లను ఇష్టానుసారం రాయించుకుని వాహనాలు తిప్పేస్తున్నారు. కొందరు అసలు నంబరు ప్లేటు లేకుండా వాహనాలు తిప్పుతున్నారు. 2016 నుంచి షోరూంలలో వాహనాలను కొన్నవారు తప్పని సరిగా ప్రభుత్వం అందజేస్తున్న హై సెక్యూరిటీ నంబరు ప్లేట్‌ను మాత్రమే బిగించుకోవాలన్న నిబంధన ఉన్నా చాలామంది అతిక్రమిస్తున్నారు.


ద్విచక్ర వాహనంపై ఎమ్మెల్యేగారి తాలుకా అంటూ..

వాహనాలకు వేర్వేరుగా..

- రవాణేతర వాహనాలకు నంబరు ప్లేటు తెలుపుగా ఉండి దానిపై నల్ల అక్షరాలు, అంకెలు ఉండాలి.
- రవాణా వాహనాలకు పసుపు నంబరు ప్లేటుపై నల్ల అక్షరాలు, అంకెలు ఉండాలి.
- రిజిస్ట్రేషన్ జరిగే విద్యుత్తు వాహనాలకు ఆకుపచ్చ నంబరు ప్లేటు ఉండాలి.

నంబరు ప్లేట్‌తో ఓ వాహనం చరిత్ర మొత్తం ఇట్టే తెలుసుకోవచ్చు. దీని ప్రాధాన్యతను గుర్తించి కేంద్ర మోటారు వెహికల్ చట్టంలో కొన్ని నిబంధనలను ఉంచారు. వాహనం కేటగిరీని బట్టి కచ్చితంగా హై సెక్యూరిటీ నంబరు ప్లేట్‌ను మాత్రమే బిగించుకోవాల్సి ఉంది. ప్లేటుపై నంబరులోని అంకెలు, అక్షరాలు మినహా ఏమీ ఉండకూడదు. చాలా వాహనాలకు సినీనటులు, రాజకీయ నాయకులు చిత్రాలు ఉంటున్నాయి. అంకెలు, అక్షరాలను జిగ్ జాగ్‌గా రాస్తున్నారు.


ఓ ఇంటి పేరుతో ఇలా...

జరిమానా ఉంది..

మోటారు వాహనాల చట్టం ప్రకారం.. ఫ్యాన్సీ నంబర్లతో తిరుగుతుంటే రవాణేతర వాహనాలకు రూ.1,150, రవాణా వాహనాలకు రూ.1,300 అపరాధ రుసుం విధిస్తారు. ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడితే రూ.100 నుంచి రూ.150 వరకు చలానా రాస్తారు. ఇతర ఉల్లంఘనలుంటే అపరాధ రుసుములు మరింత పెరగడంతోపాటు కేసులు నమోదు వరకూ వెళ్తుంది.

నంబరు ప్లేటు ఎలా ఉండాలంటే.. ● సైజు మిల్లీ మీటర్లలో..

కేటగిరీ	వాహనం ముందు ప్లేటు			వెనుక ప్లేటు		
	పొడవు	మందం	వెడల్పు	పొడవు	మందం	వెడల్పు
ద్విచక్ర వాహనం	30	5	5	35	7	5
మూడు చక్రాల వాహనం	35-40	7	5	35-40	7	5
కార్లు, ఇతర వాహనాలు	65	10	10	65	10	10

ఇజ్రాయిల్ పంపిస్తానని.. రూ.కోటిన్నరకు కుచ్చు టోపీ


కలెక్టరేట్ ఎదుట బాధితుల నిరసన

అమలాపురం కలెక్టరేట్, అల్లవరం, న్యూస్‌టుడే: వారంతా కూలీలు. గల్ఫ్ దేశాల్లో పనికి వెళ్తే ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని భావించారు. వారి ఆశను ఆసరాగా చేసుకున్న ఓ ఏజెంట్ రూ.కోటిన్నరకు కుచ్చుటోపీ పెట్టాడు. డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితులు సోమవారం అమలాపురం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లవరం మండలం కొమరగిరిపట్నానికి చెందిన పాస్టర్ ఆకుల షాలెంరాజు ఏజెంట్‌గా పరిచయం చేసుకుని ఇజ్రాయిల్ పంపిస్తానని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేశాడన్నారు. తర్వాత కాలయాపన చేస్తుండటంతో గట్టిగా నిలదీయగా టూరిస్టు వీసాపై జోర్డాన్ తీసుకు వెళ్లి 15 రోజుల తర్వాత హైదరాబాద్ తీసుకువచ్చి వదిలేశాడని వాపోయారు. ప్రస్తుతం ఇజ్రాయిల్‌లో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో పంపించడం కుదరదని తప్పించుకుంటున్నాడన్నారు. తామిచ్చిన సొమ్ము ఇవ్వాలని అడిగితే తిరిగి బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. బాధితుల్లో అమలాపురం, రావులపాలెం, రాజోలు, పి.గన్నవరం, అంతర్వేది, పాలకొల్లు, ఒంగోలు ప్రాంతాలకు చెందిన 33 మందికిపైగా ఉన్నట్లు వారు తెలిపారు.

అల్లవరంలో ఫిర్యాదు: ఆకుల షాలెంరాజు, ఆయన భార్య తమను ఇజ్రాయిల్ పంపిస్తానని నమ్మించి మోసం చేశాడని పలు ప్రాంతాలకు చెందిన బాధితులు సోమవారం అల్లవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తామంతా గతేడాది డిసెంబరు నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు విడతల వారీగా నగదు ఇచ్చామని పేర్కొన్నారు. వరంగల్‌కు చెందిన ఏజెంట్ చిరంజీవులు ద్వారా పంపిస్తానని చెప్పారన్నారు. దీనిపై ఎస్సై హరీష్‌కుమార్‌ను వివరణ కోరగా ఫిర్యాదు తీసుకుని విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

● ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావుకు సోమవారం వినతి అందజేశారు. తమను చర్చి పాస్టర్ సాల్మన్‌రాజు, వరంగల్‌కు చెందిన ఏజెంట్ బులి చిరంజీవులు మోసం చేశారని వాపోయారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	13,000-13,500
కొత్త (పచ్చి) కాయ	12,500-13,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	135-00
రిటైల్ లైవ్	157-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	259-00

సముద్రంలో మత్స్యకారుడు గల్లంతు

అంతర్వేది: అంతర్వేదిపల్లిపాలెం వద్ద సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు బొండు నూకరాజు (55) ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం రాజానగరం గ్రామానికి చెందిన ఇతను చాలాకాలంగా చేపలవేట నిమిత్తం పల్లిపాలెం వస్తూ ఉంటాడు. సోమవారం రోజూ మాదిరిగానే మరో నలుగురు మత్స్యకారులతో కలిసి సముద్రంలోకి వెళ్లాడు. ఈ సందర్భంగా పడవపై నుంచి ప్రమాదవశాత్తు జారి కెరటాల్లో కొట్టుకుపోయాడు. ఎంత వెతికినా జాడ కనిపించలేదు. దీంతో నూకరాజు సముద్రంలో గల్లంతైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలిక మృతిపై అనుమానాలు

రావులపాలెం పట్టణం, ఆలమూరు: ఆలమూరు మండలంలో ఒక గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక మృతిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఒక ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఈ బాలిక... దసరా సెలవులు ఇవ్వడం లేదని జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదు చేసిందని, అనంతరం పాఠశాల యాజమాన్యం సెలవులు ప్రకటించిందని, పాఠశాల తెరిచిన అనంతరం పదో తరగతి ఉత్తీర్ణత కావడం కష్టమని బాలికను యాజమాన్యం మానసిక ఒత్తిడికి గురిచేయడంతో 18వ తేదీన ఉరి వేసుకుని చనిపోయిందని తండ్రి ఆవేదనతో రాసిన ఒక పోస్టు సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. ఈ అంశంపై స్థానిక ఎస్సై అశోక్‌ను వివరణ కోరగా, తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు. బాలిక చనిపోయిన విషయం తల్లిదండ్రులు కూడా తమకు తెలియజేయలేదన్నారు. పాఠశాలకు చెందిన వ్యక్తులతో మాట్లాడగా బాలిక చనిపోయిన రెండు, మూడు రోజుల ముందు పాఠశాలకు రాలేదని తెలిపారు. తాము ఎవరినీ ఇబ్బందులకు గురిచేయలేదన్నారు.

వర్షానికి అరటిని రక్షించుకుందాం

న్యూస్‌టుడే, ఆత్రేయపురం



విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వాణిజ్యపంటల్లో ముఖ్యమైన అరటి పంటలో నీరు నిలిచి నష్టం వాటిల్లుతోంది. తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే తోట ఆరోగ్యకరంగా ఉంటుందని ఉద్యాన శాఖాధికారి కోటేశ్వరరావు సూచించారు.

ప్రశ్న సమాధానం

ప్రశ్న: అరటిలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు నిల్వ ఉండటంతో పంట రాణింపు ఉండటం లేదు. ఊట ఎక్కి వడిలిపోతున్నాయి. ఎలాంటి చర్యలు తీసుకోవాలి.

-త్రిమూర్తులు, రైతు, ఉచ్చిలి

సమాధానం: నీరు అధికంగా ఉన్న తోటల్లో సిగటోకా, దుంపకుళ్లు వంటి తెగుళ్లు ఆశిస్తాయి. బ్లీచింగ్ పౌడర్ 25 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్లలో పోయాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి. ముందుగా నీరు బయటకు పోయేటట్లు చూసుకోవాలి.

ప్రశ్న: తుపాను సమయంలో అరటిని ఎలా కాపాడుకోవాలి.

- సూర్య ప్రకాశరావు, రైతు, రాజవరం

సమాధానం: అధిక గాలుల నుంచి రక్షణకు వెదురు బొంగులు పాతి ఊతం ఇవ్వాలి. పక్వానికి వచ్చిన గెలలు కోసి విక్రయించుకుంటే నష్టాల నుంచి గట్టెక్కవచ్చు. మూడు నుంచి నాలుగు మాసాల మొక్కల మొదళ్లకు మట్టి ఎగదోస్తే బలంగా పెరిగి గాలులకు తట్టుకుంటుంది.


అరటిలో నిల్వ ఉన్న వర్షపునీరు

అంతర పంటలతో అదనపు రాబడి

నాలుగేళ్లపాటు ప్రభుత్వ రాయితీలు

కిర్లంపూడి, జగ్గంపేట గ్రామీణం: ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుపై రాయితీలు ప్రకటించి ప్రోత్సహిస్తుండడంతో ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపుతున్నారు. పామాయిల్ మొక్కలు నాటిన దగ్గర నుంచి నాలుగేళ్ల పాటు దిగుబడి రావడానికి సమయం పడుతుంది. ఈ నాలుగేళ్లలో రైతులు అంతర పంటలు వేసి ఆదాయాన్ని పొందవచ్చని **ఉద్యానశాఖ అధికారిణి శ్రీవల్లి** సూచిస్తున్నారు.


వేలంకలో పామాయిల్ తోటలో అంతర పంటగా అరటి

వేసే విధానం: పామాయిల్ మొక్కల మధ్య అరటి, కూరగాయలు, పత్తి, మొక్కజొన్న, అపరాలు వేసుకోవచ్చు. మొక్కలు నాటి ఏడేళ్లు దాటితే కోకో, వక్క, అల్లం, పసుపు ఇలా నీడన పండే పంటలు వేయొచ్చు. అంతర పంటల ద్వారా ఎకరాకు రూ.పదివేల వరకు ఆదాయం వస్తుంది. మినుము, పెసర ఎకరాకు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల దిగుబడి వస్తుండగా క్వింటా రూ.రెండు వేలు పైబడి అమ్ముతున్నారు. అరటి, కూరగాయలు, పత్తి, మొక్కజొన్న ఎకరాకు రూ.10 నుంచి 15 వేల వరకు ఆదాయం.

ఉద్యానశాఖ ద్వారా రాయితీలిలా..

పామాయిల్ పంటలు సాగుచేసే రైతులు వాటిలో అంతర పంటలు వేసుకునేందుకు ప్రభుత్వం రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తుంది. అంతర పంటలు ఏ రకంగా సాగు చేసుకున్నప్పటికీ హెక్టారుకు రూ.5,250 రాయితీగా ఇస్తుంది. ఒక్కొక్క రైతు ఐదు ఎకరాల వరకు రాయితీ పొందవచ్చు. ఈ విధంగా నాలుగేళ్లు రైతులకు రాయితీ ఇస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారిణి శ్రీవల్లి తెలిపారు. కోకో అంతర పంటగా వేసుకునే రైతులు మొక్కల వయస్సు ఏడేళ్లు దాటిన వాటిలో అంతర పంటలుగా వేసే కోకో పంటకు హెక్టారుకు రూ.16వేలు రాయితీగా అందుతుంది. మెట్టప్రాంతంలో పామాయిల్ సాగును పెంచేందుకు ప్రభుత్వం వంద శాతం రాయితీపై మొక్కలు ఇస్తున్నారు.

ఏటా రూ. 50వేల ఆదాయం

మీ కోసం

పామాయిల్‌లో అంతర పంటగా మినుము, పెసర వంటి అపరాలు ఏడాదికి రెండుసార్లు వేస్తున్నాం. ప్రతిపంటకు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. క్వింటా రూ.ఎనిమిది వేల వరకు అమ్ముతున్నాం. పంటకు రూ.30వేల ఆదాయం వస్తుంది. ఆ విధంగా ఏడాదికి రూ. 50 వేల నుంచి రూ.60వేలు ఆదాయం వస్తుంది.

-శెట్టిపల్లి దుర్గాప్రసాద్, సీతారామపురం



దుంప తోటల్లో నీరు నిలిస్తే చేటు



బిక్కవోలు, పెద్దాపురం: కర్రపెండలం దుంప తోటల్లో వర్షపునీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని పెద్దాపురం దుంప పరిశోధనా స్థానం కీటక శాస్త్రవేత్తలు డా. సునీత(అధిపతి), ఉద్యాన శాస్త్రవేత్త డా. జానకి వెల్లడించారు. నీరు 24 గంటల కన్నా ఎక్కువ నిల్వ ఉంటే దుంపకు కుళ్లు వచ్చే అవకాశం ఉంది. దుంప కుళ్లు వస్తే బాగా చివికిన పది కిలోల పశువుల ఎరువులో రెండు కిలోల ట్రైకోడెర్మా విరిడీ కలిపి వారం రోజులు నిల్వ ఉంచి మొక్క మొదళ్లలో వేసుకుంటే నివారించవచ్చు.

తెలుసుకుందాం..

ఎరువుల వినియోగం: దుంపతోటల్లో అధిక దిగుబడికి, అధిక పిండిశాతం కోసం మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వాడాలి. ఎకరాకు 40 కిలోలు వేయాలి. ఈ సమయంలో నత్రజని వాడకం తగ్గించాలి. పంటవేసిన 30, 60, 90 రోజులకు 52 కిలోల యూరియా ఎకరాకు మూడు దఫాలుగా మొక్క ఎదుగుదలకు వేయాలి. వేరు పెరుగుదలకు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎకరాకు దుక్కిలో 150 కిలోలు తప్పని సరిగా వేసుకోవాలి. కాంప్లెక్సు ఎరువైన 13-0-45ను పదిగ్రాములు లీటరు నీటికి, సల్ఫేట్ ఆఫ్ పొటాష్ 5 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి.

గేదెలు చూలు కట్టే కాలం.. అప్రమత్తత అవసరం



సామర్లకోట గ్రామీణం: ప్రస్తుతం శీతలగాలులు వీచే సమయం కావడంతో గేదెలు చూలు కట్టేందుకు అనుకూలమైన సమయం అని కరప ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. ఈ సమయంలో గేదెలతో పాటు యుక్త వయసుకు వచ్చిన పడ్డలు, గొడ్డుమోతు పశువులకు ఖనిజ లవణ మిశ్రమాలను దాణాలో కలిపి ఇవ్వాలి. మొలకెత్తిన పెసలు, సెనగలు వంటి వాటిని నిత్యం దాణాలో పెట్టడం ద్వారా గేదెలు ఎదకు రావడంతో పాటుగా హార్మోన్ల లోపాల సమస్యలు పరిష్కారమై చూలు కట్టే అవకాశం ఉంటుంది. ఎదకు వచ్చిన పశువులను పోతుల వద్ద కాకుండా కృత్రిమ గర్భధారణ ద్వారా మేలు జాతి పశువుల సంతతిని వృద్ధి చేసుకోవచ్చన్నారు..

రాజోలు
• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

మంచినీటి చెరువు శుభ్రతకు చర్యలు

మామిడికుదురు, న్యూస్‌టుడే: నగరంలో గెయిల్ నుంచి మంజూరైన రూ.6 కోట్లతో నిర్మించిన సమగ్ర రక్షిత మంచినీటి ప్రాజెక్టును ఉపయోగంలోకి తెచ్చేందుకు ఆర్.డబ్ల్యు.ఎస్. అధికారులు కార్యాచరణ చేపట్టారు. ప్రధాన చెరువులో ఏళ్లకాలంగా నిలిచిపోయిన వ్యర్థ జలాలను పూర్తిగా బయటకు మళ్లించిన తర్వాతనే అందులో పంటకాలువ నీటిని నింపాలని స్థానికులు స్పష్టం చేయడంతో ఆ దిశగా చర్యలకు ఉపక్రమించారు. ఇంజన్ ద్వారా చెరువులో ఉన్న నిల్వ నీటిని పూర్తిగా బయటకు మళ్లిస్తున్నారు. దీనిని పూర్తిగా శుభ్రం చేశాక కొత్త నీటితో నింపుతామని సంబంధిత ఏఈఈ జయశ్రీ సోమవారం తెలిపారు. త్వరలోనే మంచినీటి ప్రాజెక్టును ఉపయోగంలోకి తీసుకురానున్నట్లు చెప్పారు.

జొన్నాడలో ఇసుక తవ్వకాలు ప్రారంభం

ఆలమూరు, న్యూస్‌టుడే: ట్రాక్టర్ల ద్వారా ఉచిత ఇసుక తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో సోమవారం జొన్నాడ ఇసుక ర్యాంపు వద్ద కూటమి నాయకులు కొబ్బరికాయలు కొట్టి తవ్వకాలను ప్రారంభించారు. తాడి శ్రీనివాసరెడ్డి, గోదావర్తి [illegible], సర్పంచి కట్టా శ్రీనివాస్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలందరికీ మెరుగైన వైద్యసేవలు

రాజోలు, న్యూస్‌టుడే: ప్రజలందరికీ మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు సోమవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌సీఎస్ వారి సీఎస్ఆర్ నిధుల నుంచి సుమారు రూ.3 కోట్లతో ఈ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. మాజీ ఎమ్మెల్యే రుద్రరాజు పద్మరాజు, ఎంపీపీ కేతా శ్రీనివాస్, ముదునూరి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

మలికిపురం, న్యూస్‌టుడే: వివిధ అనారోగ్య సమస్యలతో చికిత్సలు చేయించుకున్న వారికి సీఎం సహాయ నిధి నుంచి రూ.17 లక్షల ఆర్థిక సాయం మంజూరైనట్లు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చెప్పారు. విశ్వేశ్వరాయపురంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఈ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టరు గుండుబోగుల పెద్దకాపు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం పట్టణం: పేద ప్రజలను అన్ని విధాలా ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న 11 మందికి సీఎం సహాయనిధి నుంచి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5,35,508కు సంబంధించిన చెక్కులను సోమవారం రావులపాలెంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన అందజేశారు. రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, మండలాధ్యక్షుడు గుత్తుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

చెత్తకుప్పల తొలగింపు

మామిడికుదురు: మామిడికుదురు ముస్లింవీధిలో రహదారి పక్కన చెత్తకుప్పలు, పాలిథిన్ వ్యర్థాలు పేరుకుపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెప్పిన సమస్యను సర్పంచి గౌస్ మొహిద్దీన్, కార్యదర్శి పీఎస్‌పీ ప్రసాద్ వద్ద ప్రస్తావించగా వెంటనే స్పందించారు. చెత్తకుప్పలను తొలగించి ట్రాక్టర్‌పై డంపింగ్‌యార్డుకి తరలించారు. పరిసరాల్లో బ్లీచింగ్ చల్లి శుభ్రం చేయించారు.

వీధి దీపాలకు మరమ్మతులు

రావులపాలెం పట్టణం: స్థానిక తహసీల్దారు కార్యాలయం రోడ్డులో వీధి దీపాలు వెలగక పోవడంతో రాత్రి సమయాల్లో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎల్.దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లడంతో సిబ్బందిని పంపి మరమ్మతులు చేయించారు.

రావులపాలెం గ్రామీణం: రావులపాడులోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు సక్రమంగా వెలగకపోవడంతో రాత్రి సమయంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పంచాయతీ కార్యదర్శి సాయిపట్టాభిరామయ్య దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బందిని పంపి మరమ్మతులు చేయించారు.

మరుగుదొడ్లకు తలుపుల ఏర్పాటు

అంబాజీపేట, న్యూస్‌టుడే: పుల్లేటికుర్రు జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలోని మరుగుదొడ్లకు తలుపులు లేని వైనంపై ఈ నెల 10న 'తలుపులు ఇలా.. మరుగు ఎలా' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంఈవో ఎం.ప్రకాష్ ఇక్కడి మరుగుదొడ్లకు తలుపులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884






దేవేరులకు వింజామర సేవ | వరద స్వరూపుడు వేంకటేశ్వరుడు | కేరళ కళాకారుల వాయిద్యం | ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యానందరావు

బ్రహ్మోత్సవం.. శోభాయమానం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: వాడపల్లిలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని ఆలయం మొత్తం సుగంధభరిత పరిమళ పుష్పాలు, విద్యుద్దీపాలంకరణతో శోభాయమానంగా వెలుగొందుతోంది. సోమవారం సాయంత్రం ధ్వజారోహణం ఆగమోక్తంగా జరిగింది. తిరువీధుల అష్టదిక్కుల్లో బలిని వేస్తూ శ్రీమలయప్పస్వామి ఆలయ పరివార దేవతలతో కలిసి ఊరేగారు. మంగళవాయిద్యాలు మోగుతుండగా అర్చకస్వాములు ధ్వజస్తంభంపై గరుడ ధ్వజాన్ని ఆవిష్కరించారు. రాత్రి శేషవానంపై ఊరేగుతూ భక్తులకు అభయప్రదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. దేవస్థానం ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండల తెదేపా అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు, లొల్ల సర్పంచి కాయల జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



ఉభయ దేవేరులతో స్వామివారు

ఏకాదశరుద్రుల ఆలయాల సందర్శన

అంబాజీపేట, న్యూస్‌టుడే: కోనసీమలో కొలువుదీరిన ఏకాదశరుద్రుల శివాలయాలను సినీగేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరశాస్త్రి సోమవారం సందర్శించారు. ముందుగా అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయంలో పూజలు చేసి అనంతరం అంబాజీపేట, అయినవిల్లి, అమలాపురం గ్రామీణ మండలాల్లో ఉన్న ఆలయాలను దర్శించుకున్నారు. ఏకాదశరుద్రులపై పాట రాయాలని కొందరు కోరిన మీదట ఈ ఆలయాల సందర్శనకు వచ్చినట్లు స్థానికులు చెప్పారు. అంతకుముందు ఆయనకు ఆయా ఆలయాల ప్రాముఖ్యతను గ్రామస్థులు తెలియజేశారు.



పుల్లేటికుర్రు వ్యాఘ్రేశ్వరస్వామిని దర్శించుకుంటున్న జొన్నవిత్తుల



మాట్లాడుతున్న ఎంపీ హరీశ్‌మాథుర్, పక్కన ఎమ్మెల్యే దేవ

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

మలికిపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని అమలాపురం ఎంపీ గంటి హరీశ్‌మాథుర్, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. లక్కవరంలోని ఓ ఫంక్షన్ హాలులో అడబాల యుగంధర్ అధ్యక్షతన సోమవారం జరిగిన తెదేపా సభ్యత్వ నమోదు శిక్షణ సమావేశంలో వారు మాట్లాడారు. రాజోలు నియోజకవర్గంలో తెదేపాకు 40 వేల క్రియాశీల సభ్యత్వాలు నమోదు చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రైల్వే, అలైన్‌మెంట్, 216 జాతీయ రహదారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. చిటికెన రామ్మోహనరావు, మంగెన భూదేవి, గెడ్డం సింహా, కోట పుష్పకుమారి, రుద్రరాజు వెంకట్రామరాజు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రగతి వెలుగులు

న్యూస్‌టుడే, రావులపాలెం పట్టణం, గ్రామీణం, ఆత్రేయపురం, ఆలమూరు

గత అయిదేళ్ల వైకాపా పాలనలో గ్రామాలను పట్టించుకోకపోవడంతో అభివృద్ధి లేక వెలవెలబోయాయి. సరైన రహదారులు లేక రాకపోకలకు ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పల్లెలకు మహర్దశ పడుతోంది. ప్రభుత్వం 'పల్లె పండగ' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. గ్రామాల్లో పండగ వాతావరణంలా రహదారుల నిర్మాణానికి శంకుస్థాపనలు చేస్తున్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో పెద్దఎత్తున సిమెంట్ రహదారులు, కాలువలు, కంకర రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది.

కొత్తపేట నియోజకవర్గంలోని రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు, కొత్తపేట మండలాల్లో 57 గ్రామాలు ఉన్నాయి. గ్రామాల్లో నిత్యం ప్రజలు సంచరించే రహదారులను అభివృద్ధి చేసేవిధంగా ప్రణాళికలను అధికారులు సిద్ధం చేశారు. ప్రతి గ్రామంలోనూ రహదారులు, కాలువల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి శంకుస్థాపనలు చేస్తున్నారు. నాలుగు మండలాల పరిధిలో పనులను అధికారులు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. గ్రామాల వారీగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పనులకు భూమిపూజ చేసి ప్రారంభిస్తున్నారు. అయిదేళ్ల తరువాత గ్రామాల్లో రహదారుల నిర్మాణాలు చేపడుతుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మండలాల వారీగా పనులు..

మండలం	పనులు	నిధులు (రూ.కోట్లలో)
కొత్తపేట	16	2.98
రావులపాలెం	24	2.84
ఆత్రేయపురం	30	3.61
ఆలమూరు	17	2.47



రావులపాలెం రోడ్డు దుస్థితి. దీని మరమ్మతులకు ప్రతిపాదించారు

త్వరితగతిన పూర్తి చేస్తాం..

ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన రహదారులు, డ్రెయిన్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేస్తాం. ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేసిన అన్ని గ్రామాల్లోనూ గుత్తేదారులతో మాట్లాడి పనులు వేగవంతంగా చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

- వీరభద్రరావు, జేఈ, పంచాయతీ రాజ్, రావులపాలెం

వైద్య విద్యార్థినికి ఆర్థిక సాయం

పి.గన్నవరం, న్యూస్‌టుడే: అయినాలవారిపాలేనికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని మద్దాలి దేవీ శిరీష విద్యాభ్యాసానికి రాష్ట్ర కాపు ఉపాధ్యాయ సంక్షేమ సంఘం తరపున రూ.90 వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన అలివ్ మిఠాయి అధినేత దొరరాజు, సాఫ్ట్‌వేర్ కంపెనీ అధినేత నాగకుమార్‌లు ఈ విద్యార్థిని విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు ఆర్థిక సాయమందిస్తామని తెలిపారన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు పైడిపర్తి చిన్ని, నియోజకవర్గ కన్వీనరు పోల్నాటి నాగప్రసాద్, ప్రధాన కార్యదర్శి నంద్యాల నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిక్కం మైనర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కర్బలా యాత్రికులకు ఆత్మీయ వీడ్కోలు

మామిడికుదురు: నగరం నుంచి కర్బలా యాత్రకు బయల్దేరిన 25 మంది ముస్లిం యాత్రికులకు అమలాపురం ఎంపీ హరీశ్‌మాథుర్ సోమవారం రాత్రి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఇరాన్, ఇరాక్, సిరియా దేశాల్లోని పవిత్ర పుణ్యక్షేత్రాలను వీరంతా 30 రోజుల పాటు దర్శించనున్నారు. వీడ్కోలు పలికిన వారిలో తెదేపా ముస్లిం మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముకరమ్ హుస్సేన్, నాయకులు ఫర్హత్ అలీబేగ్ తదితరులు ఉన్నారు.



రేవుకు వెళ్లాలంటే యాతనే..

కరవాక రేవులో నిత్యం పడవ ప్రయాణం చేసే విద్యార్థులు, స్థానికులు దుర్భరంగా మారిన రహదారిపై తీవ్ర అవస్థలు పడుతున్నారు. 600 మీటర్ల మేర గుంతలు పడి బురదతో అస్తవ్యస్తమైన రోడ్డుపై రాకపోకలు ఇబ్బందికరంగా మారాయని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని బెంబేలెత్తిపోతున్నారు. పడవ దాటి ఓడలరేవు వెళ్లేందుకు గుంతల రోడ్డుపై యాతన పడుతున్నామని అంటున్నారు. ఏఈ కె.కృష్ణంరాజు దృష్టికి తీసుకువెళ్లగా రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు చేసి పంపామని, నిధులు వచ్చిన వెంటనే పనులు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

అడుగడుగునా చెత్తే..

రాజోలులో ప్రధాన పంట కాలువకు చేర్చి ఉన్న రోడ్డు చెత్త, వ్యర్థాలతో అధ్వానంగా మారింది. స్థానికులు వ్యర్థాలను ఇక్కడే పడేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. పందులు స్వైరవిహారం చేస్తుండటంతో ఆ ప్రాంతమంతా అస్తవ్యస్తంగా తయారైంది. దీనివల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రెహ్మాన్‌ను వివరణ కోరగా అక్కడ వ్యర్థాలు తొలగించి మళ్లీ ఎవరూ వేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, రాజోలు





వర్షం వస్తే ఇక్కట్లే..

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అయినవిల్లి కొత్తకాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ వంద వరకు నివాసాలు ఉన్నాయి. వర్షం నీరు ముంచెత్తడంతో మట్టి రహదారులు బురదమయంగా మారుతున్నాయి. దోమల ఉద్ధృతి పెరిగి పలువురు విషజ్వరాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అయినవిల్లి

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

కొత్తపేట, న్యూస్‌టుడే: పలివెలలోని కోటమెరకలో సోమవారం శ్రీవరసిద్ధి వినాయక, భక్తాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వేర్వేరుగా పాల్గొన్నారు. గతంలో శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.10 లక్షలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి రూ.5 లక్షలు ఆలయ నిర్మాణానికి మంజూరైనట్లు జగ్గిరెడ్డి ఆలయ కమిటీ సభ్యులు, తెదేపా, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

మలికిపురం: కేశనపల్లిలోని యెనుముల బ్రహ్మానందం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. దాత దొడ్డా శ్రీనివాస్ ఈ విగ్రహాన్ని సమకూర్చగా ప్రధానోపాధ్యాయుడు నాత్ర ఉమామహేశ్వరరావు మండపాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు యెనుముల నాగు, గుబ్బల మురళీవెంకటసత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు రాపాక సత్యనారాయణ, ఎస్ఎంసీ ఛైర్మన్ అడబాల ఏసుబాబు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న మాలధారులు

అయ్యప్పస్వామి కలశ పూజ

అంతర్వేది, న్యూస్‌టుడే: సఖినేటిపల్లి మండలం మోరి గ్రామంలో పేరాబత్తుల సుబ్బారాయుడుగురుస్వామి పీఠం ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్పస్వామి కలశ పూజ ఘనంగా నిర్వహించారు. గురుస్వామి పూర్ణయ్య, వాడపల్లి శ్రీనివాసాచార్యులు, తోట శివస్వామి సారథ్యంలో అయ్యప్ప పూజ, పడి పూజలను భక్తిప్రపత్తులతో జరిపించారు. స్వామియే శరణమయ్యప్ప నామస్మరణతో ఆ ప్రాంతం మారుమోగింది. పేరాబత్తుల దొరబాబు, ఆకుల నరేశ్‌స్వాముల దంపతుల కలశస్థాపన చేసి పూజా కార్యక్రమాన్ని జరిపారు. పరిసర గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

వరద బాధితులకు చేయూత

మలికిపురం, న్యూస్‌టుడే: విజయవాడలో వరదలకు నష్టపోయిన ప్రజలను ఆదుకోడానికి తమవంతు సాయంగా మండలంలోని బట్టేలంక గ్రామస్థులు రూ.1.01 లక్షల విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని సోమవారం బట్టేలంకలో జరిగిన కార్యక్రమంలో సర్పంచి బోణం సీతారత్నం చేతుల మీదుగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి బట్టేలంక గ్రామస్థులు చూపిన మానవత్వాన్ని ప్రశంసించారు. ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి, ఉపసర్పంచి పి.ప్రకాశరావు, ఎంపీటీసీ సభ్యుడు ఆవుపాటి లలితాశివజ్యోతి, మార్క్‌ఫెడ్ డైరెక్టరు గుండుబోగుల పెద్దకాపు, బోణం సాయి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు నివాళి

పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సోమవారం రాజోలులో పోలీసులు, విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి అమరవీరుల స్తూపం వరకు నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. కార్గిల్ యుద్ధంలో మృతిచెందిన కోళ్ల వెంకన్న చిత్రపటానికి సీఐ నరేష్‌కుమార్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి ఎస్సైలు పి.రాజేష్‌కుమార్, సురేష్, దుర్గాశ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. ● శాంతిభద్రతల నిర్వహణలో పోలీసు సిబ్బంది పాత్ర, దేశానికి వారు చేస్తున్న సేవలు గురించి కొత్తపేట వీకేవీ కళాశాల ప్రిన్సిపల్ కేపీ రాజు వివరించారు. కళాశాల నుంచి కొత్తపేట మెయిన్‌రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఆలమూరులో పోలీసులు ర్యాలీ నిర్వహించి అమరవీరులకు నివాళి అర్పించారు. - న్యూస్‌టుడే, రాజోలు, కొత్తపేట, ఆలమూరు



కొత్తపేటలో ర్యాలీ..



రాజోలులో..

హైవే సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం

రావులపాలెం పట్టణం, ఆలమూరు, న్యూస్‌టుడే: రహదారుల చెంతన చిరు వ్యాపారులపై హైవే సిబ్బంది దురుసుగా ప్రవర్తించడంపై ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రావులపాలెం జాతీయ రహదారిపై పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే బండారు, రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, హైవే అధికారులతో కలిసి సోమవారం పర్యటించారు. డిగ్రీ కళాశాల సమీపంలో సర్వీసు రహదారిని త్వరితగతిన పూర్తిచేయాలని, బస్టాండ్, అరటి మార్కెట్ చిన్నపాటి వర్షానికి ముంపునకు గురవుతున్నందున డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

పైవంతెన నిర్మాణ జాప్యంపై..

జొన్నాడ పైవంతెన నిర్మాణం నత్తనడకన సాగుతుండటంపై గుత్తేదారు సంస్థపై ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అసహనం వ్యక్తం చేశారు. జాతీయ రహదారి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహిస్తూ, మార్చి నాటికి పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు.

ఆలమూరు-మండపేట రోడ్డుకు మరమ్మతులు

ఆలమూరు, న్యూస్‌టుడే: స్థానిక పారిశ్రామికవేత్త వంటిపల్లి కాశీవిశ్వనాథం సొంత ఖర్చులతో జేసీబీని ఏర్పాటు చేయించి ఆలమూరు-మండపేట ప్రధాన రహదారిపై గుంతలను సోమవారం మరమ్మతులు చేయించారు. ఆలమూరు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఈదల నల్లబాబు పర్యవేక్షించారు.

తాటిచెట్టుపై పిడుగు

మామిడికుదురు: అల్పపీడన ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కురిసిన వర్షానికి రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. పాశర్లపూడి కొండాలమ్మ చింత నుంచి నగరం వరకు 216 జాతీయ రహదారిపై నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులకు తీవ్ర అవస్థలు ఎదురయ్యాయి. మొగలికుదురు, పాశర్లపూడి, బి.దొడ్డవరం, ఈదరాడ గ్రామాల్లోని కాలనీలు జలమయమయ్యాయి. ఆదుర్రులో తాటిచెట్టుపై పిడుగు పడింది.

జీతాలు ఇవ్వాల్సిన బాధ్యత పాలకవర్గానిదే..

మలికిపురం, న్యూస్‌టుడే: పనిచేసిన కాలానికి జీతాలు ఇవ్వాల్సిన బాధ్యత పాలకవర్గానిదేనని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. జీతాల కోసం గత 41 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఎమ్‌వీఎన్, జేఎస్ అండ్ ఆర్‌వీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకుల దీక్షా శిబిరాన్ని ఆయన సోమవారం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీతాలు చెల్లించాలని డిమాండు చేశారు. సమస్యను పరిష్కరించాల్సింది విద్యాశాఖ అధికారులు తప్ప పోలీసులు కాదన్నారు. ఇప్పటికే నాలుగు నెలల జీతాలు పెండింగులో ఉండగా విధుల్లో చేరి పనిచేయమని పాలకవర్గం చెప్పడం దారుణమన్నారు. యూటీఎఫ్ నాయకుడు బేతి నీడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

మొక్కు చెల్లించుకున్న బండారు అభిమాని

ఆలమూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, కొత్తపేటలో బండారు సత్యానందరావు ఎమ్మెల్యేగా గెలిస్తే జొన్నాడ నుంచి శ్రీశైలం వరకూ పాదయాత్ర చేస్తానన్న మొక్కును జొన్నాడకు చెందిన అభిమాని భావన శ్రీనివాస్ చెల్లించుకున్నారు. 7న బయల్దేరి సుమారు 450 కి.మీ 13 రోజులు పాదయాత్ర చేసి సోమవారం శ్రీశైలం చేరుకుని మల్లికార్జునస్వామిని దర్శించుకుని పాదయాత్ర ముగించారు.



ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత

అంబాజీపేట: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు తొండవరం ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు హెచ్‌ఎం కేశవాచార్యులు, పీడీ సూర్యనారాయణ తెలిపారు. ఈ నెల 25 నుంచి 27 వరకు కాణిపాకంలో జరిగే అండర్-18 పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. స్టాండ్‌బైగా పి.పూజిత ఎంపికైందన్నారు. అండర్-19 పోటీలకు పి.దుర్గాదేవి ఎంపికైందన్నారు. మంద మౌనిక తైక్వాండో పోటీల్లో ఉత్తమ ప్రదర్శన ఇచ్చినట్లు తెలిపారు.

వీఆర్వోకు వేగివారిపాలెం గ్రామస్థుల సత్కారం

రాజోలు, న్యూస్‌టుడే: వేగివారిపాలెం సచివాలయంలో వీఆర్వోగా పనిచేస్తూ బదిలీపై అప్పనపల్లి వెళ్తున్న కాదంబరి అన్నపూర్ణారావుకు గ్రామస్థులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొంతు శ్రీనివాస్, ఉపసర్పంచి పెదపూడి ఆదిలక్ష్మి, కార్యదర్శి పార్వతి, ఇన్‌ఛార్జి వీఆర్వో నిఖిల్ పాల్గొన్నారు.

సామాజిక కవికి సన్మానం

అంబాజీపేట: అంబాజీపేటకు చెందిన సామాజిక కవి, జాతీయ అవార్డు గ్రహీత పొలమూరి వెంకట్‌ను తాడేపల్లిగూడెం బుద్ధాల హాలులో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ- కళాజాతరలో శ్రీకళావేదిక సంస్థ ఛైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సన్మానించారు. ఈ విషయాన్ని వెంకట్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత కచేరీ

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను ఆకట్టుకుంది. కళాకారులకు ఈవో నల్లం సూర్యచక్రధరరావు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

అమలాపురం
• అమలాపురం • ముమ్మిడివరం

ఈ నెల 25 వరకు మొబైల్ ఆధార్ సేవలు

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన మొబైల్ ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌ఛార్జి కమిషనర్ కె.సత్యనారాయణ సూచించారు. ఆధార్ కార్డులో మార్పులు, కొత్త ఆధార్ కార్డుల నమోదు, ఆధార్ అప్‌డేషన్ వంటి వాటికి ఈనెల 25వ తేదీ వరకు శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 22న గొల్లలపేట, పోలమ్మచెరువు సచివాలయాలకు సంబంధించి స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోనూ, 23న పల్లిపాలెం, రాజుపాలెం వార్డు సచివాలయాలకు సంబంధించి స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల, 24న బొండాయికోడు తూము, రాయుడువారిపాలెం సచివాలయాల పరిధిలో ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం వద్ద, 25న సూరాయిచెరువు సచివాలయం వద్ద ప్రజలకు మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో విధులు నిర్వహించిన తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఒప్పంద ఉద్యోగులు కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. గతంలో తమను ధాన్యం కొనుగోలుకు సంబంధించి టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, సహాయకులుగా విధులు నిర్వహించేందుకు జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా విధుల్లోకి తీసుకున్నారన్నారు. రబీలో రెండు నెలల కాలానికి గాను వేతనం ఇవ్వాల్సి ఉందన్నారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.


పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సమాజంపై అవగాహన అవసరం


విజేతలతో విద్యానిధి పాఠశాల ఛైర్మన్ బాపయ్యనాయుడు

అమలాపురం పట్టణం: విద్యార్థులకు సమాజంపై అవగాహన అవసరమని విద్యానిధి పాఠశాల ఛైర్మన్ ఏబీ బాపయ్యనాయుడు పేర్కొన్నారు. అమలాపురం విద్యానిధి పాఠశాలలో సోమవారం ‘ఈనాడు’ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభ పాటవ పోటీపరీక్షలు జరిగాయి. అంతర్జాలాన్ని వినియోగించడం వలన కలిగే లాభాలు, నష్టాలు, సామాజిక మాధ్యమ ప్రభావంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. మొదటి మూడు స్థానాల్లో వరుసగా వి.సుదీప్త, డి.ఆశ్రిత్, బి.నాగిరెడ్డిబాబు నిలిచారు. అనంతరం విజేతలకు ‘ఈనాడు’ సమకూర్చిన బహుమతులను, ప్రశంసా పత్రాలను పాఠశాల ఛైర్మన్ ఏబీ నాయుడు, టీవీఎన్ మాధవి, పి.ఆంటోనిలు అందజేశారు.

గురుకుల పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని వినతి

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరం గురుకుల పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు నోచుకోక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పాఠశాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ ఎస్.వీరవెంకటసత్యనారాయణ అన్నారు. ఎంపీ హరీష్‌మాధుర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. పాఠశాలలో 600 మంది విద్యార్థులు ఉన్నా పూర్తి స్థాయిలో వసతులు లేవని, ఆవరణ లోతట్టుగా మారడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. పాఠశాలకు క్రీడాప్రాంగణం ఏర్పాటు చేయాలని కోరారు. ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. డాక్టర్ సత్తిరాజు, పిరిపే దివ్యభారతి, ఎన్.హైమావతి, లంక వర్షపసాద్, బీవీ అన్నవరం తదితరులు పాల్గొన్నారు.


చెత్త బుట్టల పంపిణీ



అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: సమనస పంచాయతీలో సమస్యపై ‘ఈనాడు’లో ఈ నెల 19న ‘చెత్త బుట్టలు మూలకు చేర్చారు దేనికో..!’ శీర్షికతో ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం సర్పంచి పరమట శ్యామ్‌కుమార్ ఇంటింటికీ చెత్త బుట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యెరుబండి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచి మామిళ్లపల్లి దొరబాబు, తెదేపా గ్రామకమిటీ అధ్యక్షుడు మామిళ్లపల్లి సుబ్బరాజు, పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు కథనానికి స్పందన

రహదారిపై మృత్యు ఘంటిక



రక్షణ తలకెక్కని వైనం ● ఏటా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం, అమలాపురం పట్టణం

ఏటా రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. క్షతగాత్రులతో పాటు మృతుల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. ఇందులో యువకులే ఎక్కువ మంది బాధితులు కావడం గమనార్హం. మితిమీరిన వేగంతో ప్రయాణించి చాలా మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. తలకు తీవ్ర గాయాలు కావడంతోనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారు. శిరస్త్రాణం ధరించాలని పోలీసులు ఎన్ని సార్లు చెప్పినా.. చాలా మందికి తలకెక్కడం లేదు.

మరణాలు అధికమే..

అమలాపురం సబ్ డివిజన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. 2022 నుంచి ఏటా సుమారు రెండు వందలకు పైగానే ప్రమాదాలు జరుగుతున్నాయి. అందులో వంద మంది వరకు మృతులు ఉన్నారు. తలకు బలమైన గాయాలు కావడంతో స్థలంలోనే చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన కేసుల్లో 80 శాతం మరణాలు హెల్మెట్లు ధరించని కారణంగా నమోదవుతుండటంతో ఆందోళన కలిగిస్తోంది.

అమలాపురం సబ్‌డివిజన్ పరిధిలో రహదారి ప్రమాదాలు

ఏడాది	ప్రమాదాలు	క్షతగాత్రులు	మృతులు
2022	241	184	72
2023	245	181	71
2024	156	151	44

(ఈ నెల 18 వరకు..)


భట్నవిల్లిలో గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదం (పాత చిత్రం)

వేగానికి అడ్డుకట్ట లేదా..?

రోడ్డు ప్రమాదాల బారిన పడిన వారిలో యువకులే ఎక్కువ మంది ఉంటున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ.. వేగంగా ద్విచక్ర వాహనాలు నడపటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. వేగంగా నడిచే ఖరీదైన ద్విచక్ర వాహనాలను నడిపే వారు వేగానికి మించి వెళ్తున్నారని చెబుతున్నారు. జరిమానాలు విధిస్తున్నప్పటికీ శిరస్త్రాణం ధరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

ఈ ప్రాంతాల్లో ఎక్కువగా..

అమలాపురం సబ్‌డివిజన్ పరిధిలో అమలాపురం పట్టణం, గ్రామీణం, అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ముమ్మిడివరం, ఐ.పోలవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. అమలాపురం- కాకినాడ జాతీయ రహదారిలోనూ ఇదే పరిస్థితి ఉంది. పోలీసులు తనిఖీలు చేస్తున్నప్పటికీ ప్రమాదాల తీవ్రత మాత్రం తగ్గడం లేదు.

ఎప్పటికప్పుడు తనిఖీలు



ప్రమాదాలకు అతివేగమే ప్రధాన కారణం. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించాలి. కారులో వెళ్లేటప్పుడు సీటు బెల్ట్ వేసుకోవాలి. ప్రధానంగా లైసెన్సు లేకుండా వాహనాలు నడిపేవారిపై చర్యలు తీసుకుంటున్నాం. సబ్‌డివిజన్ పరిధిలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతున్నాం.
– టి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, డీఎస్పీ, అమలాపురం

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేం

ముమ్మిడివరం, ఐ.పోలవరం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల దినం సందర్భంగా ముమ్మిడివరంలో సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్సై డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని సీఐ మోహన్‌కుమార్ అన్నారు. జమ్మి, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు. ● ఐ.పోలవరం పోలీస్ స్టేషన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు.

కాట్రేనికోన: దేశం కొరకు విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎస్సై అవినాష్ పేర్కొన్నారు. కాట్రేనికోనలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. వారి సేవలను కొనియాడారు. అనంతరం స్థానిక జడ్పీపాఠశాల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఏఎస్సై సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ముమ్మిడివరంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు


కాట్రేనికోన ర్యాలీలో విద్యార్థులు

గ్రామాల అభివృద్ధే లక్ష్యం


రహదారికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అల్లవరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని ఎమ్మెల్యే ఆనందరావు తెలిపారు. సోమవారం బోడసకుర్రు, సామంతకుర్రు, ఎంట్రుకోన, తూర్పులంక, గుండెపూడి, దేవగుప్తం, డి.రావులపాలెం, పల్లిపాలెం గ్రామాల్లో ఉపాధి నిధులతో నిర్మించే సీసీ రహదాల పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి గాలికి వదిలేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వం ప్రజలకు అవసరమైన వసతుల కల్పన కనీస చర్యలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో దెందుకూరి సత్తిబాబురాజు, సాయి, శ్రీనివాస్, బాబి, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

రమణయ్య సేవలు మరువలేనివి

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే బీవీ రమణయ్య సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. కామనగరువులోని బీవీ రమణయ్య కాలనీలో ఆయన వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. వసతిగృహాల ఏర్పాటులో రమణయ్య చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జల్లి శ్రీనివాస్, ఐ.ఎస్.మల్లేశ్వరరావు, పరమట శ్రీనివాసరావు, డి.రాజశేఖర్, పరమట రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యానాంలో న్యాయశాఖ కార్యదర్శి పర్యటన

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి న్యాయ శాఖ కార్యదర్శి డా.ఎల్ఎస్ సత్యమూర్తి సోమవారం యానాంలో పర్యటించారు. ఆయనను పుదుచ్చేరి ప్రభుత్వ దిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, కమిషనర్ రామకృష్ణ ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


వెంకటరత్నంను అభినందిస్తున్న నాయకులు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: ఇటీవల విజయవాడలో జరిగిన ఏపీ సర్కిల్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో అమలాపురం బీఎస్ఎన్ఎల్ డివిజన్‌కు చెందిన ఉద్యోగి బీహెచ్ వెంకటరత్నం ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 83 కేజీల విభాగంలో ఎంపికై నవంబరు 11 నుంచి గౌహతిలో జరిగే పోటీలకు అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పద్మరాజు, మట్టపర్తి సముద్రం, వెంకటరమణ, పద్మావతి, కృష్ణ, సుమంత్ తదితరులు సోమవారం వెంకటరత్నంను అభినందించారు.

ఆటల పోటీలు వాయిదా

ఉప్పలగుప్తం: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 22, 23 తేదీల్లో జరగాల్సిన ఆటల పోటీలను తుపాను హెచ్చరిక కారణంగా వాయిదా వేసినట్లు గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి అడబాల శ్రీనివాస్ సోమవారం తెలిపారు. అమలాపురంలోని బాలయోగి స్టేడియం, ఇందుపల్లి మైదానంలో జరగాల్సిన క్రికెట్, పవర్ లిఫ్టింగ్ ఎంపికలు వాయిదా పడినట్లు ఆయన తెలిపారు. తదుపరి తేదీలను త్వరలో తెలియజేస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పైపులైనుకు మరమ్మతులు



సమస్య: కాట్రేనికోనలోని తాగునీటి పైపులైను లీకవుతుంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి. – గ్రామస్థులు

పరిష్కారం: సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. పైపులైనుకు సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

స్పందనకు వందనం

వీధి దీపాలు బాగు చేశారు

సమస్య: కందికుప్ప పరిధిలో కొన్నిచోట్ల వీధిదీపాలు వెలగడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలి. – స్థానికులు

పరిష్కారం: సమస్యను సర్పంచి వెంకటలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బందితో వెలగని వీధిదీపాలకు మరమ్మతులు చేయించారు.
- న్యూస్‌టుడే, కాట్రేనికోన

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య
అమలాపురం: 79811 19595, ముమ్మిడివరం: 80085 74166

స్వాములకు నవంబరు 13 వరకు అన్నదానం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరం మండలం పత్సమట్లవారిపాలెంలో అయ్యప్ప స్వామి మాలధారులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ నిత్యాన్నదాన కార్యక్రమం నవంబరు 13వ తేదీ వరకు నిర్విరామంగా జరుగుతుందని.. అయ్యప్ప మాలధారులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి భిక్షను స్వీకరించాలని అయ్యప్ప సేవా సమితి సభ్యులు తెలిపారు.

అన్నక్యాంటీన్‌లో ఉచితంగా భోజనాలు

ముమ్మిడివరం: అయినవిల్లి మండలం క్రాప గ్రామానికి చెందిన బొబ్బిలి దుర్గారావు తనయుడు శివాజీ నాయుడు పుట్టినరోజు సందర్భంగా ముమ్మిడివరం నగర పంచాయతీ బళ్లగేటు సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌లో సోమవారం ఉచితంగా భోజనాలను ఏర్పాటు చేశారు. తాడి నరసింహారావు, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, పలువురు తెదేపా నాయకులు ఉన్నారు.

దాడి చేశారని ఫిర్యాదు

ముమ్మిడివరం: నగర పంచాయతీ పరిధిలోని సోమిదేవరపాలెంలో బతుకుదెరువు కోసం మురుగుకాలువ చెంతన ప్రభుత్వ భూమిలో బడ్డీ (దుకాణం) పెట్టుకుంటే కొంతమంది దాన్ని తొలగించి.. అడ్డుకున్న తమపై దాడి చేసి గాయపర్చారని గ్రామానికి చెందిన వస్త్రాల సుబ్రహ్మణ్యం సోమవారం ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికంగా మురుగుకాలువ చెంతన ఏర్పాటు చేసుకున్న బడ్డీని కొంతమంది తాళ్లుకట్టి ట్రాక్టరుతో ఊరికి చివర పడేశారని.. అడ్డుకున్న తన మనవడు గణేష్, తనపైనా దాడి చేసి గాయపర్చారని సుబ్రహ్మణ్యం ఫిర్యాదులో పేర్కొన్నారు. బడ్డీని తొలగించి దాడి చేసిన ఘటనపై విచారణ నిర్వహించి తనకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. అమలాపురం అశోక్‌నగర్‌లో సోమవారం కాంగ్రెస్ నాయకుల సమావేశం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిసినా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ నెరవేరలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు, పీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, అయితాబత్తుల సుభాషిణి, వంటెద్దు బాబి, రామకృష్ణారావు, గెడ్డం సురేష్‌బాబు, షకీలా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చిట్టిబాబు

వెతలు వినాలి పరిష్కారం చూపాలి


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై పలువురు వినతులు అందజేశారు. సమస్యలకు పరిష్కారం చూపాలని వేడుకున్నారు. మద్యం దుకాణాలు తొలగించాలని, పింఛన్లు మంజూరు చేయాలని, స్థానిక సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరారు.

మద్యం దుకాణంతో ఇబ్బందులు

మేమంతా రోజూ గణపతి థియేటర్ ఎదురుగా ఉన్న రోడ్డు మీదుగా నిత్యం కళాశాలకు రాకపోకలు సాగిస్తున్నాం. ఇటీవల అక్కడ దుకాణం ఏర్పాటు చేశారు. అక్కడ మద్యం కోసం వచ్చేవారు రోడ్డుకు అడ్డుగా ఉంటున్నారు. మార్గంలో వెళ్లేందుకు తీవ్ర అసౌకర్యంగా ఉంటోంది. అధికారులు స్పందించి తక్షణం మద్యం దుకాణం ఇక్కడి నుంచి తొలగించాలి.
– ఓ ప్రైవేటు కళాశాల ఇంటర్ విద్యార్థులు, ఈదరపల్లి

పింఛను నిలిపేశారు..



నాకు 25 ఏళ్లుగా దివ్యాంగ పింఛను వస్తోంది. నాలుగు నెలల నుంచి పింఛను నిలిపి వేశారు. అధికారుల వద్దకు వెళ్తే సదరం ధ్రువీకరణ పత్రం మళ్లీ తీసుకోమంటున్నారు. చిన్నతనంలోనే పోలియో కారణంగా ఎడమ వైపు శరీరం స్పర్శ లేదు. అధికారులు స్పందించి వెంటనే పింఛను మంజూరు చేయాలి.
– విత్తనాల దుర్గ, టి.కొత్తపల్లి, ఐ.పోలవరం మండలం

దుకాణం వద్దు



అల్లవరం నుంచి మా గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ రోడ్డు మీదుగా నాలుగు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో ప్రభుత్వ మద్యం దుకాణం ఉండగా.. నిత్యం ఇబ్బందులు పడ్డాం. అధికారులు స్పందించి ఇక్కడ దుకాణం ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలి.
– గ్రామస్థులు, గోపాయిలంక, అల్లవరం

ఆక్రమణలు తొలగించాలి

మా నివాసాలకు వెళ్లే రహదారిలో కొంత మంది రోడ్డుకు మధ్యలో ఇనుప స్తంభాలు ఏర్పాటు చేసి వాహన రాకపోకలకు అడ్డుకుంటున్నారు. నివాసాల వద్దకు ఎటువంటి వాహనాలు వచ్చేందుకు మార్గం లేదు. దీనిపై పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఉన్నతాధికారులు స్పందించి మా ప్రాంతానికి వెళ్లే రహదారిపై ఏర్పాటు చేసిన స్తంభాలను తొలగించాలి.
– గ్రామస్థులు, కందులపాడు, అమలాపురం మండలం



కుండలేశ్వరా పాహిమాం



కాట్రేనికోన: పార్వతీసమేత కుండలేశ్వరాలయంలో అర్చకులు కాళ్లకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు, అమ్మవారిని వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

విజయ భేతాళస్వామి దసరా ఉత్సవం



అమలాపురం గ్రామీణం: పేరూరులోని విజయ భేతాళస్వామి దసరా ఉత్సవాన్ని శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని 15 ప్రాంతాలకు చెందిన వాహనాలను ప్రత్యేకంగా అలంకరించి విజయభేతాళ స్వామికి పూజలు చేశారు. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు స్వామివారిని దర్శించుకున్నారు. శెట్టిబలిజ సంఘం ముఖ్య నాయకులు బొంతు పాపాయి, పెచ్చెట్టి చంద్రమౌళి దసరా ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో స్వామివారి ఊరేగింపు ఘనంగా జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

దీపావళి కానుక పంపిణీ ప్రారంభం



యానాం: పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ కార్డుదారులకు దీపావళి కానుకగా 10 కిలోల బియ్యం, 2 కిలోల పంచదార ఉచితంగా పంపిణీ కార్యక్రమాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.రంగసామి, లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్‌లు సోమవారం ప్రారంభించారు.

పంచాయతీల్లో విలీనం చేయాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సర్పంచులు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయాలను ఆయా పంచాయతీల్లో విలీనం చేయాలని సర్పంచులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. సచివాలయాల్లోని సిబ్బందికి విధులు కేటాయించే వారు లేక ఖాళీగా ఉంటున్నారన్నారు. ఈ వ్యవస్థను రాజ్యాంగం విరుద్ధంగా ఏర్పాటు చేశారన్నారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగాబత్తుల శాంతకుమారి, పెద్దిరెడ్డి రామచంద్రరావు, కాకర శ్రీనివాసరావు, చెల్లిబోయిన ఏలీన, సలాది బుచ్చిరాజు, ప్రభాత్, బాలరాజు, అడబాల తాతకాపు, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

ఉప్పలగుప్తం: చల్లపల్లి గ్రామదేవత మహిషాసురమర్ధిని అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేల అయితాబత్తుల ఆనందరావు, పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, సర్పంచి ఇసుకపట్ల జయమణి పూజలు చేశారు.

గడువులోగా అర్జీలు పరిష్కరించాలి

అమలాపురం కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వస్తున్న అర్జీలకు నిర్ణీత గడువులోగా పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో జేసీ నిశాంతి, డీఆర్వో వెంకటేశ్వర్లులో కలిసి వినతులు స్వీకరించారు. 276 మంది పలు సమస్యలపై అర్జీలు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

యానాం వెంకన్న ఆలయ నిర్మాణం పరిశీలన

యానాం, న్యూస్‌టుడే: యానాంలో రూ.7 కోట్లతో నిర్మిస్తున్న మీసాల వెంకన్న ఆలయ నిర్మాణ పనులను పుదుచ్చేరి ప్రభుత్వ దిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సోమవారం పరిశీలించారు. తితిదే ఆగమ ఇంజనీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్న ఈ పనులకు సంబంధించి పురోగతి, ఇతర విషయాలను కృష్ణారావు అడిగి తెలుసుకున్నారు.

ఇదేనా స్వచ్ఛత..!

గ్రామాల్లో చెత్త కనిపించకుండా చర్యలు చేపట్టాలంటూ అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా పంచాయతీ సిబ్బందిలో మాత్రం మార్పు రావడం లేదు. అమలాపురం మండలం కామనగరువులోని ప్రతాప్‌నగర్, ఎమ్ఎస్ఎన్ కాలనీలకు వెళ్లే మార్గం చూస్తే ఇట్టే అర్థమవుతుంది. ఈ కాలనీలకు వెళ్లే రహదారి పక్కన చెత్త పేరుకుపోయి ఉండటంతో స్థానికులతో పాటు అటుగా వెళ్లేవారు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు చొరవ తీసుకుని చెత్తను తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



- న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

ద్విచక్ర వాహనం బీభత్సం


గాయపడిన మహిళ

అమలాపురం పట్టణం: నల్లవంతెన రోడ్డులో ద్విచక్రవాహనం అదుపుతప్పి బీభత్సం సృష్టించింది. అక్కడ నిలిపి ఉంచిన మూడు ద్విచక్రవాహనాలను, అటుగా నడిచి వెళ్తున్న బొక్కా మణిని ఢీకొంది. మహిళకు గాయమైనా పట్టించుకోకుండా ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు వ్యక్తులు వేగంగా ముందుకు వెళ్లిపోయారు. సావరం రోడ్డులో యువకులు అడ్డుకోగా.. దగ్గరకు వస్తే చంపేస్తామని బెదిరించారు. దీనిపై పట్టణ ఎస్సై పృథ్వీ మాట్లాడుతూ వాహనాన్ని సీజ్ చేశామని చెప్పారు. బాధితులు ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

మండపేట

•మండపేట •రామచంద్రపురం

అనుమతుల్లేని పాఠశాలలకు పిల్లలను పంపవద్దు

పామర్రు, న్యూస్‌టుడే: ప్రభుత్వ గుర్తింపు, అన్ని అనుమతుల్లేని పాఠశాలలకు పిల్లలను విద్యాభ్యాసానికి పంపవద్దని ఎంఈవో-1 అలజంగి నాగరాజు సూచించారు. సోమవారం ఆయన కె.గంగవరంలో విలేకరులతో మాట్లాడుతూ భట్లపాలిక గ్రామంలో శ్రీ బాలాదిత్య ఆంగ్లమాధ్యమ పాఠశాలకు గుర్తింపు, అనుమతులు రాకపోవడంతో రెండు రోజులు కిందట మూయించివేశామన్నారు. అయితే పాఠశాల యాజమాన్యం వేరే దారుల నుంచి విద్యార్థులను తీసుకెళ్లి తరగతులు నిర్వహిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. దీనిమీద పరిశీలన చేస్తామన్నారు. ఈ లోగా విద్యార్థులను పంపితే వారి భవిష్యత్తుకు తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

గడువులోగా అర్జీల పరిష్కారం

అంగర: కపిలేశ్వరపురం మండలం వల్లూరులో గ్రామ సర్పంచి దాసి మీనాకుమారి అధ్యక్షతన సోమవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. గ్రామంలోని భూముల రీ సర్వే సమస్యలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్ పి.చిన్నారావు మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. అర్జీలన్నిటినీ పరిశీలించి గడువులోగా పరిష్కరిస్తామని చెప్పారు. స్థానిక వీఆర్వోలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


వల్లూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ చిన్నారావు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

సృజనకు పదును పెట్టారు.. విజేతలుగా నిలిచారు

మండపేట, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌వీఎస్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు', 'విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విద్యార్థులు పాల్గొని ఆసక్తికర విషయాలను ప్రస్తావించారు. ఈ పోటీలో విజేతలుగా పదో తరగతి విద్యార్థి ఎం.దయాసాగర్ మొదటి బహుమతి, 9వ తరగతి విద్యార్థిని బి.పావని ద్వితీయ బహుమతి, 8వ తరగతి విద్యార్థిని ఎస్.శ్రీమహాలక్ష్మి తృతీయ బహుమతి సాధించారు. న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు ఎం.రవికుమార్, జీవీవీ సుబ్బారావు, ఎల్.శ్రీనివాసరావు, ఐఎస్ఎస్ ప్రసాద్ వ్యవహరించారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటగణేష్ విజేతలకు 'ఈనాడు' సమకూర్చిన బహుమతులు అందజేశారు.


వ్యాసరచన పోటీలో విద్యార్థులు

ఎన్నాళ్లీ నరకయాతన

అభివృద్ధికి దూరంగా రహదారులు

మండపేట, న్యూస్‌టుడే: నియోజకవర్గ కేంద్రం మండపేట నుంచి వివిధ గ్రామాలకు చేరుకునే ప్రధాన రహదారులు గోతులు పడి నిత్యం ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. గత ప్రభుత్వం ప్రధాన రహదారులను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో మరింత అధ్వానంగా మారాయి. అధికారులు ఎన్ని సార్లు ప్రతిపాదనలు పంపించినా వాటికి మోక్షం కలగలేదు. కూటమి ప్రభుత్వం దృష్టిసారించి రహదారులను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నీ గోతుల దారులే...

మండపేట నుంచి ఆలమూరు, మండపేట- కపిలేశ్వరపురం, పాలతోడు, ఏడిద, అర్తమూరు, ద్వారపూడి నుంచి జెడ్.మేడపాడు, కేశవరం గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. మండపేట-ద్వారపూడి రహదారి ఎన్నికల ముందు పూర్తి చేసినప్పటికీ మధ్యలో కల్వర్టులు నిర్మించాల్సిన ఆరు ప్రాంతాల్లో మాత్రం గోతులు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారుతోంది. ✦ జెడ్.మేడపాడు-ద్వారపూడి రహదారి దశాబ్ద కాలంగా అభివృద్ధికి నోచుకోవడంలేదు. ✦ మండపేట- ఏడిద రహదారి గత సంవత్సరం పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయకుండా గోతులు పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేసినా మళ్లీ గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. ✦ మండపేట-గుమ్మిలేరు మీదుగా జొన్నాడ వద్ద జాతీయ రహదారి కలిసే వరకు ఏర్పడిన భారీ గోతులు ప్రమాదకరంగా మారాయి. ✦ మండపేట - కపిలేశ్వరపురం వెళ్లే ప్రధాన రహదారులు అధ్వానంగా ఉన్నాయి.


నారాయణరెడ్డి ఆసుపత్రి సమీపంలో ఇలా..


పంచాయతీరాజ్ శాఖ కార్యాలయం వద్ద గొయ్యి

✦ వల్లూరు దాటిన తరువాత నల్లూరు కాలువను అనుకుని ఉన్న గట్టు రోడ్డు దిగబడి మధ్యలో గోతులు ఏర్పడి రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ✦ మండపేట పులగుర్త మీదుగా మాచవరం వెళ్లే రహదారి మరమ్మతులకు నోచుకోలేదు. ✦ రాయవరం నుంచి వెంటూరు, చెల్లూరు, వెదురుపాక, వి.సావరం రహదారుల్లో ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ✦ మండపేట పట్టణం పరిధిలోనే ప్రధాన రహదారి పూర్తిగా గోతులు పడి నిత్యం రాకపోకలు సాగించే స్థానికులు సైతం ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై డీఈ సూర్యనారాయణను వివరణ కోరగా తాత్కాలిక మరమ్మతులకు రూ.20లక్షలు మంజూరైనట్లు తెలిపారు. వర్షాలు తగ్గిన తరువాత పనులు ప్రారంభిస్తామన్నారు.

తాగునీటి వృథా నివారణ

ఈనాడు కథనానికి స్పందన

ద్వారపూడి: మండపేట మండలం కేశవరం గ్రామ పరిధి దేవుడుతాళ్ల కాలనీ పంచాయతీలో రెండో రక్షిత మంచినీటి ట్యాంకు కొళాయి నుంచి తాగునీరు వృథాగా పోతోందని సోమవారం 'రక్షిత నీరు వృథా చూడు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి ఎన్.సుబ్బారావు స్పందించారు. నీరు వృథా కాకుండా వెంటనే కొత్త ట్యాప్ బిగించారు. సమస్య పరిష్కారమవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

22 నుంచి 25 వరకు ఆధార్ శిబిరాలు

మండపేట: ఆధార్‌లో తప్పులు సరిచేసుకునేందుకు, అప్‌డేట్ చేసుకునేందుకు ఈ నెల 22 నుంచి 25 వరకు మండపేట పట్టణంలో ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. 22, 23న విజ్ఞాన్ కళాశాల, 24న న్యూకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం, 25న గాంధీనగర్‌లోని 13వ సచివాలయం వద్ద ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

ద్వారపూడి: మండపేట మండల పరిధిలో మంగళవారం నుంచి 25 వరకు ఆధార్ ప్రత్యేక నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో కె.సత్యనారాయణమూర్తి తెలిపారు. మారేడుబాక, ఏడిద, ఏడిద సీతానగరం, మెర్నిపాడు, పాలతోడు, జడ్.మేడపాడు సచివాలయాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీవనాధారం తొలగిస్తున్నారంటూ ఫిర్యాదు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రామచంద్రపురం నియోజకవర్గంలోని ఆర్యవటం గ్రామానికి చెందిన మాసాబత్తుల సత్యవతి సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అధికారులకు ఫిర్యాదు చేశారు. తాను ఆర్యవటంలోని కోళ్లసెంటర్ వద్ద కాలువగట్టు చెంతన పాక వేసుకుని వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, పాక తొలగించాలని పంచాయతీ కార్యదర్శి నోటీసు ఇచ్చారని వాపోయారు. పెద్ద వేసుకున్నవారిని వదిలేసి కక్షపూరితంగా తనకే నోటీసు ఇచ్చారని ఆరోపించారు. తన భర్త 30 ఏళ్ల కిందట మరణించారని, ఇద్దరు పిల్లలు వికలాంగులని, తాను ఒంటరిగా ఉంటూ చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని తెలిపారు. ఇప్పటికే కిడ్నీ సమస్యతో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నానన్నారు. రామచంద్రపురం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి బాధ్యత మరొకరికి అప్పగించడం అన్యాయమని తాను ఓ కార్యకర్తగా మీడియాలో మాట్లాడడంతో కక్షగట్టి మంత్రి సుభాష్ తండ్రి తన పూరిపాకను కాలువ గట్టునుంచి తొలగించాలని అధికారులతో ఒత్తిడి చేయిస్తున్నారని ఆరోపించారు. తనను వేధించడం దారుణమని వాపోయారు.


కలెక్టరేట్‌లో వినతి పత్రం చూపుతున్న సత్యవతి

20 సూత్రాల కమిటీ ఛైర్మన్‌కు అభినందనలు

రాయవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర ఇరవై సూత్రాల కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన లంక దినకర్‌ను రాయవరం మండల ఎన్డీఏ నేతలు సోమవారం అభినందించారు. విజయవాడలోని కమిటీ ఛైర్మన్ కార్యాలయంలో భాజపా నాయకులు చాట్రాతి జానకీరాంబాబు, చిరట్ల సుబ్బారావు, నరాల రాంబాబు, తెదేపా నాయకులు వుండవిల్లి రాంబాబులు దినకర్‌ను కలిసి దుశ్శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు.


బాధ్యతలు స్వీకరించిన దినకర్‌ను అభినందిస్తున్న కూటమి నేతలు

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

మండపేట: పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని, సమాజం కోసం తమ ప్రాణాలు త్యాగం చేసిన వారికి జోహార్లు తెలియ జేస్తున్నట్లు మండపేట ఎస్సై హరికోశ్ శక్తి తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పోలీసు స్టేషను వద్ద విద్యార్థులతో మాట్లాడుతూ సమాజం కోసం పోలీసులు చేసే త్యాగాల గురించి వివరించారు. అనంతరం కలువపువ్వు సెంటరులో మానవహారంగా అమరవీరులకు నివాళి అర్పించారు. పోలీసు సిబ్బంది, సచివాలయ పోలీసులు పాల్గొన్నారు.

ద్వారపూడి: ఇప్పనపాడు పోలీస్ స్టేషన్ నుంచి తాపేశ్వరం చైతన్య పాఠశాల వరకు విద్యార్థులతో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. మండపేట రూరల్ ఎస్సై డి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో తాపేశ్వరం బస్ స్టాండ్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు జోహార్లు అర్పించారు.

ద్రాక్షారామ: స్థానిక పోలీసు స్టేషన్ వద్ద ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ ఫ్లెక్సీ ఎదుట సిబ్బంది మౌనం పాటించి నివాళి అర్పించారు.

పామర్రు: మండల కేంద్రం కె.గంగవరంలో పోలీస్ స్టేషన్ వద్ద అమరవీరుల చిత్రపటాలకు పామర్రు ఎస్సై షేక్ జానీ బాషా, సిబ్బంది పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పలువురు గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ద్రాక్షారామలో నివాళి


తాపేశ్వరంలో పోలీసులు, విద్యార్థుల ర్యాలీ

ఖండన ప్రకటన

మా క్లయింటు డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండపేట మండలం, వెలగతోడు గ్రామ కాపురస్తులు గుణ్ణం వీరవెంకట సత్యనారాయణ ప్రసాదు, S/o వెంకట్రావు నాకు ఇచ్చిన సంజాయిషీ పై ది.14-10-2024 వ సం॥రం తేదీన నూనె వీరవెంకట సత్యనారాయణ గారి కుమారుడు వీరవెంకట విజయ్‌కుమార్ గారు ఇచ్చిన పత్రికా ప్రకటనకు ఈ ఖండన ప్రకటన యావన్మందికి తెలియజేయునది.

నా క్లయింటు సహోదరి అయిన శ్రీమతి నూనె అనంతలక్ష్మి గారు కేన్సర్ వ్యాధికి గురి అయినప్పుడు నా క్లయింట్ సహోదర ప్రేమచేత సదరు అనంతలక్ష్మి గార్కి సకల విధమైన వైద్యము వగైరాల కొరకు కాకినాడలో గల ఇనోదయ హాస్పిటల్‌లో చేర్పించి వైద్యము జరిపించినారు. సదరు అనంతలక్ష్మి గారు తన అన్న చేసిన సేవలను గుర్తించి 28 ఫిబ్రవరి 2024 సం॥రం తేదీన నా క్లయింట్ పేరున సెటిల్మెంట్ దస్తావేజు వ్రాసి రిజిస్టరీ చేయించి సదరాస్తిని నా క్లయింట్‌కు స్వాధీనపర్చినారు. అప్పటి నుండి మా క్లయింట్ గవర్నమెంట్ వారికి చెల్లించవలసిన పన్నులు చెల్లించి రెవిన్యూ రికార్డులలో తన పేరు నమోదు చేయించుకుని ఏవిధమైన అభ్యంతరములు లేకుండా సదరు సెటిల్మెంట్ దస్తావేజు షెడ్యూలు ఆస్తిని నా క్లయింటు అనుభవిస్తూ ఉన్నాడు.

నా క్లయింట్ తన సహోదరి అయిన నూనె అనంతలక్ష్మి గార్ని మభ్యపెట్టి రామచంద్రపురం సబ్ రిజిస్టరీ ఆఫీసు వద్దకు ఆమెను తీసుకునివెళ్లినట్లుగానూ, అచ్చట పైన పేర్కొన్న సెటిల్మెంట్ దస్తావేజు రిజిస్టరీ చేయించినట్లుగానూ జ్ఞప్తికి వచ్చి, తన భర్తఅయిన వీరవెంకట విజయ్‌కుమార్‌కు ఆ విషయము బోగట్టా చేయమని కోరగా సదరు బోగట్టా రీత్యా నూనె అనంతలక్ష్మి గారిచే చేయించుకున్నట్లుగా గుణ్ణం వీరవెంకట సత్యనారాయణ ప్రసాదు రిజిస్టరీ చేయించుకున్నట్లుగా తెలియవచ్చినదని, నూనె వీరవెంకట విజయ్‌కుమార్ గారు ఇచ్చిన పత్రికా ప్రకటన అసత్యము. అలాగే మరియు తన సోదరుడైన గుణ్ణం వీరవెంకట సత్యనారాయణ ప్రసాదు దుర్బుద్ధితో ఆమెను మభ్యపెట్టి, ఆమె తాలూకా ఆస్తిని దురుద్దేశ్యపూర్వకముగా ఆమె అభీష్టమునకు వ్యతిరేకముగా మాయ కనపర్చి తన పేరున సెటిల్మెంట్ దస్తావేజు వ్రాయించుకొనుటయే గాక, సదరు అనంతలక్ష్మి గారి పేరున గల ఆస్తి తాలూకు ఒరిజినల్ దస్తావేజున్నూ మరియు ఆమె తాలూకు బంగారు అభరణములను కాజేసినట్లు తెలియవచ్చి ఆమె సదరు అన్ని విషయములు తెలియజేయుచూ ది.14-06-2024 సం॥రం తేదీన కాకినాడ ఇనోదయ ఆసుపత్రి నందు సాక్షుల కృతముగా వీలునామా వ్రాయించియున్నారు అని నూనె వీరవెంకట విజయ్‌కుమార్ గారు ఇచ్చిన పత్రికా ప్రకటన అసత్యము. అలాగే నా క్లయింట్‌కు వ్రాసిన సెటిల్మెంట్ దస్తావేజు రద్దు కొరకున్నూ మరియు బంగారు ఆభరణములు, ఒరిజినల్ దస్తావేజులు తిరిగి ఆమె తరఫున పొందుటకు అవసరమగు యావత్తు న్యాయప్రక్రియలు కొనసాగించుటకు తదుపరి పూర్తి హక్కులతో అనుభవించుటకున్నూ ఆమె భర్తగారికి అధికారము మరియు హక్కులు దఖలు చేయు అంశములు మరియు ఇతర అంశములు కూడా తెలియజేయుచూ ది.14-06-2024 సం॥రం తేదీన నూనె అనంతలక్ష్మి గారు వ్రాసిన వీలునామా అనియు నూనె వీరవెంకట విజయ్‌కుమార్ గారు ఇచ్చిన పత్రికా ప్రకటన అబద్ధము మరియు చట్టరీత్యా చెల్లనేరదు. అలాగే నా క్లయింటుపై నూనె వీరవెంకట విజయ్‌కుమార్ సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనుచూ సదరు దస్తావేజు చట్టప్రకారము రద్దు చేయుదురనియు, నూనె వీరవెంకట విజయ్‌కుమార్ గారు ఇచ్చిన ప్రకటన అసత్యము. మరియు నా క్లయింట్‌పై ఏవిధమైన చర్యలు తీసుకొనుటకు నూనె వీరవెంకట విజయ్‌కుమార్ గార్కి ఏవిధమైన హక్కులేదు.

కావున ఎవరైననూ నా క్లయింటుకు సెటిల్మెంట్ దస్తావేజు డాక్యుమెంట్ నెంబర్ 5731/2024 ద్వారా దఖలుపడిన ఆస్తి విషయమై ఎట్టి లావాదేవీలు చేసినట్లైనా, అట్టి లావాదేవీలు చట్టప్రకారం చెల్లుబాటు కావనియు ఆ లావాదేవీలు ఏమియూ నా క్లయింటును ఏవిధముగాను బైండు చేయజాలవని, తద్వారా వారు నష్టపోవుదురని ఈ ఖండన ప్రకటన ద్వారా హెచ్చరించడమైనది. సదరు అనంతలక్ష్మి గారు బుద్ధిపూర్వకముగాను, ఏవిధమైన ఒత్తిడులు లేకుండగాను, ప్రేమయే ప్రతిఫలముగా ఎంచుకుని నా క్లయింట్‌కు ఇష్టపూర్వకముగా తన భర్తకు కూడా తెలియపర్చి రామచంద్రపురం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో సెటిల్మెంటు డీడ్ వ్రాసి ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని నా క్లయింటుకు చెందజేసియున్నారు. నా క్లయింట్ సహోదరి మరణించిన తరువాత నూనె వీరవెంకట విజయ్‌కుమార్ దురుద్దేశ్యముతో నా క్లయింట్‌కు చెందజేసిన ఆస్తిని కాజేసే ఉద్దేశ్యముతో తప్పుడు వీలునామాను సృష్టించి, తప్పుడు అంశములతో పత్రికా ప్రకటన ఇప్పించియున్నారని ఈ ఖండన ప్రకటన ద్వారా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూల్: డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రపురం సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో చేరిన చెల్లూరు గ్రామ పంచాయతీ ఏరియా చెల్లూరు గ్రామం తాలూకు దస్తావేజు ప్రకారం జిరాయితీ పల్లం రివిజన్ (1) సర్వే నెం.767-1 రులో య.0-46 ట్లు భూమిన్నీ 2) సర్వేనెం.767-2రులో య.0-27 ట్లు భూమిన్నీ 3) సర్వే నెం.771రులో య.1-50 ట్లు భూమిన్నీ వెరశి య.2-23ట్లు భూమికి రెవెన్యూ డిపార్ట్‌మెంట్ చేసిన రీ సర్వే లో పైన తెలిపిన మూడు సర్వే నెంబర్లు తాలూకు భూమి సర్వే నెం.771రులో చేరి పరిమితి య.2-00ట్లు భూమిగా నిర్ధారించియున్నారు. దర్మిలా సదరు భూమిని మండల సర్వేయర్ సర్వే చేయగా పైన తెలిపిన మూడు సర్వే నెంబర్లలో గల య.2-23ట్లు భూమి సర్వే నెం.771రు లోకి వచ్చియున్నది. పరిమితి య.2-00 ట్లు భూమిగా నిర్ధారణ అయివున్నది. సదరు విధముగా పైన తెలిపిన మూడు సర్వే నెంబర్లు రీ సర్వే ప్రకారం ఏర్పడిన సర్వే నెం.771రుకు ఎల్.పి.నెం.2794రు ప్రకారం య.2-00 ట్లు భూమికి హద్దులు.

తూర్పు: నూనె వీరవెంకట సత్యనారాయణమూర్తి (ఏసుబాబు); పడమర: పసల అప్పలరాజు గారి భూమి; ఉత్తరం: వల్లూరి గంగాధరరావు గారి భూమి; దక్షిణం: నూనె వీరవెంకట విజయ్‌కుమార్ గారి భూమి.

సదరు హద్దుల మధ్య య.2-00ట్లు భూమి పూర్వము నుండి అమలు జరుపుచున్న ప్రకారం రివాజు నీటి మార్గములు, రివాజు దారి మార్గములు, రివాజు వాహన రాకపోక మార్గములు యావత్తు ఈజిమెంట్ హక్కులతో సహా.

మండపేట
తేది: 21-10-2024

నిమ్మలపూడి నారాయణమూర్తి, అడ్వకేట్
మండపేట, సెల్: 98664 86470

పందుల సంచారాన్ని నిలువరించండి

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రులో పందులు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. గుడి, బడి అని కూడా లేకుండా ప్రజల మధ్యనే అవి నడయాడుతున్నాయని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. నివాసాల మధ్యనే తిరుగుతుండడంతో రోగాల పాలవుతామని ఆందోళన చెందుతున్నారు. అసలే వాతావరణం మారింది, జ్వరాలు, విపరీతంగా సోకే సమయం. ఇలాంటపుడు కూడా పందుల సంచారాన్ని అరికట్టకపోవడం శోచనీయమంటున్నారు. గతంలో స్థానిక ఉన్నత పాఠశాలకు దగ్గరలో ఒక పాక ఉండేదని ఇప్పుడు ఐదు వరకూ పెరిగిపోయాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అక్కడ నుంచి పందులు పాఠశాల ఆవరణలోకి వచ్చేస్తున్నాయని, పిల్లలు మధ్యాహ్న భోజనం చేసేటపుడు కూడా అక్కడే ఉంటూ దుర్గంధం వ్యాపింప చేస్తున్నాయని చెప్పారు. పాఠశాలను సందర్శించిన ప్రజాప్రతినిధులందరికీ ఈ విషయాన్ని చెబుతున్నామని హామీలు అయితే ఇస్తున్నారు కానీ వాటిని తొలగించడానికి చర్యలు తీసుకోవడం లేదని వారు వాపోయారు. దీనిపై స్థానిక పంచాయతీ కార్యదర్శి సీతారామయ్య మాట్లాడుతూ గతంలో గ్రామంలో విచ్చలవిడిగా తిరుగుతుంటే నోటీసులు ఇచ్చి ఆపుచేసామన్నారు. పాఠశాల ఆవరణలోకి వెళ్లకుండా పందుల పెంపకం దారులను హెచ్చరిస్తామని చెప్పారు.



పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

మండపేట: ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని తెదేపా రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ మౌలానా ఒక ప్రకటనలో కోరారు. నవంబరు 6లోగా ఫారం 18 ద్వారా తహసీల్దారు కార్యాలయంలో ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు.

రోజా శుభ్రం చేయాలి

పామర్రు: మండలంలోని 83 పాఠశాలల్లోని మరుగుదొడ్లు, బాత్రూమ్‌లు శుభ్రం చేయడానికి అవసరమైన ద్రావణాలను సోమవారం సరఫరా చేశామని ఎంఈవో-2 చోడిశెట్టి ఆంజనేయులు వెల్లడించారు. వీటిని ఆయాలు సక్రమంగా ఉపయోగించాలని ప్రతి రోజూ నాలుగు సార్లు శుభ్రపరిచి విద్యార్థులు వినియోగంలో అసౌకర్యం కలుగకుండా చేయాలన్నారు. దీనిపై ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలని ఆయన సూచించారు.

మార్కెట్లో మురుగుతో పాట్లు



ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ద్రాక్షారామ మార్కెట్‌లో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అధ్వానంగా మారింది. ఎక్కడపడితే అక్కడ మురుగునీరు రోడ్లపైకి వచ్చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యానాం సెంటరు నుంచి మార్కెట్టులోకి వచ్చే దారిలో ప్రతిరోజూ కాలువల్లో మురుగునీరు రోడ్డుపై పొంగి ప్రవహిస్తుంది. ప్రస్తుతం బఠాణీ దుకాణాలు ఎదురుగా ఉన్న కల్వర్టుపై మూత తీసేయడంతో దాదాపు రెండు నెలల నుంచి మురుగునీరు దాని నుంచి పైకి వచ్చేస్తుంది. అంతే కాకుండా వాహనదారులు చీకట్లో ఈ గుంతలో పడటం వల్ల అదుపుతప్పి కింద పడుతున్నారు. అరటిపళ్ల దుకాణాలు ఎదురుగా కల్వర్టుకు అప్రోచ్ దెబ్బతినడంతో ద్విచక్ర వాహనాలు వెళ్లే సమయంలో గుంతల్లో మురుగునీరు పక్క దుకాణాలపైకి చిమ్ముతోంది. దీనిపై పంచాయతీ వారు వెంటనే స్పందించి కల్వర్టుకు మూత వేయడంతో పాటుగా అరటిపళ్ల దుకాణం వద్ద అప్రోచ్‌ను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.సత్యనారాయణను వివరణ కోరగా తాను ఛార్జి తీసుకొని ఒక రోజు అయిందన్నారు. డ్రైనేజీ పరిశీలించినట్లు చెప్పారు. డ్రైనేజీపై ఆక్రమణలు తొలగించి మరమ్మతులు చేపట్టాల్సి ఉందని, దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు అందిందన్నారు. ఒకటి రెండు రోజుల్లో ఈ పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు.

లక్ష్మణమూర్తికి నివాళి

అంగర, న్యూస్‌టుడే: రైతు ఉద్యమ నేత తోరాటి లక్ష్మణమూర్తి జీవితం స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. లక్ష్మణమూర్తి వర్ధంతి సందర్భంగా సోమవారం కపిలేశ్వరపురం మండలం అంగరలో అమరవీరుల స్మారక స్థూపం వద్ద ఆయన విగ్రహానికి గ్రామస్థులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అంగరకు చెందిన లక్ష్మణమూర్తి పాల్గొని, పోలీసుల కాల్పుల్లో వీరమరణం పొందారని గుర్తు చేసుకున్నారు. యానాల వీర్రాఘవులు, ముత్తా చిన్నా, పసలపూడి కృష్ణ, సుంకర సత్యనారాయణ, యానాల సుబ్బారావు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.


అంగరలో లక్ష్మణమూర్తి విగ్రహం వద్ద గ్రామస్థుల నివాళి

గౌరవ వేతనం కొనసాగించాలని వినతి

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 8,596 మంది పాస్టర్లు ఉన్నారని గౌరవ వేతనం పొందేవారికి తిరిగి పథకాన్ని అమలులోకి తీసుకుని రావాలని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు మోసా అబ్రహం ఆధ్వర్యంలో సభ్యులు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను సోమవారం రామచంద్రపురం క్యాంపు కార్యాలయంలో కలసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపైన, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పైన తమకు ఎంతో నమ్మకం ఉందని అందుకే వినతిపత్రం ఇచ్చి కోరుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి సమాన న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ కాకినాడ జిల్లా చిల్డ్రన్ వింగ్ అధ్యక్షుడు కాసరపు సింహాంద్రి, కాకినాడ జిల్లా ఎస్సీ సంక్షేమ వింగ్ అధ్యక్షులు టి.ఎస్.రాజు, కాకినాడ జిల్లా కో ఆర్డినేటర్ ఉదయకుమార్, కాకినాడ సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్, సిటి వర్కింగ్ ప్రెసిడెంట్ మోజెస్ కుమార్, వనమాడి సుందర్, టి.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులానికి భూమిపూజ

ద్వారపూడి, న్యూస్‌టుడే: మండపేట మండలం అర్తమూరులో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మినీ గోకులం నిర్మాణానికి వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ పూర్వ సభ్యుడు పడాల సుబ్బారెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. పాడి రైతులను ప్రోత్సహించడానికి గతంలో తెదేపా ప్రభుత్వం మినీ గోకులాలను ప్రవేశపెట్టిందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి అన్నారు. గొలుగూరి అన్నపూర్ణ, ఉప సర్పంచి కర్రి సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య

మండపేట: 80085 74183, రామచంద్రపురం: 80085 74191

వీధి దీపాలు బాగు చేశారు

స్పందనకు వందనం

రామచంద్రపురం: వైఎస్సార్ నగర్ 14వ వీధిలో వీధిదీపాలన్ని వెలగడం లేదు. దీంతో అంధకారంలో ఉందని స్థానికుల విన్నపాన్ని మున్సిపల్ కమిషనర్ అయ్యప్పనాయుడు స్పందించి సోమవారం ఆయా వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.

చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

అనపర్తి గ్రామీణం: అనపర్తి మండలంలో పలు చోరీలకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ సుమంత్, ఎస్సై శ్రీనునాయక్ తెలిపారు. సెప్టెంబరు 28తేదీ రాత్రి అనపర్తి ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న జ్యువెలరీ వర్క్ దుకాణంలోను, ఈ నెల 10న కుతుకులూరు గ్రామంలోని పులగం వెంకటరెడ్డి నివాసంలో చోరీలకు పాల్పడిన డా.బీఆర్‌అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెదురుపాక గ్రామానికి చెందిన కట్టాశివశంకర్ అనే వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. చోరీ చేసిన 211 గ్రాముల వెండి వస్తువులు, 12 గ్రాముల బంగారు అభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుణ్ని అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారని, రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించినట్లు వివరించారు. కట్టాశివశంకర్‌పై సుమారు 50 పాతకేసులు ఉన్నట్లు చెప్పారు.


నిందితుడు, స్వాధీనం చేసుకున్న అభరణాలతో పోలీసులు

గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: మంత్రి సుభాష్

పామర్రు, న్యూస్‌టుడే: రామచంద్రపురం నియోజకవర్గంలోని 77 గ్రామాల్లోనూ అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని, త్వరలోనే దానిని అమలు చేయడానికి కావాల్సిన నిధులను తీసుకొస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండలంలోని కోటిపల్లి, కె.గంగవరం గ్రామాల్లో సోమవారం రాత్రి మనగ్రామం-మన సుభాష్ కార్యక్రమం జరిగింది. కోటిపల్లిలో జరిగిన సభకు సర్పంచి పెమ్మాడి బేబీ అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ పవిత్ర పుణ్యక్షేత్రం కోటిపల్లికి నిత్యం వందలాది మంది యాత్రికులు వస్తుంటారని, గ్రామంలో తాగునీటి కొరత ఉందని మంత్రి దృష్టికి తెచ్చారు. మంత్రి మాట్లాడుతూ గ్రామంలో ముందుగా రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరు చేశామని త్వరలో పనులు మొదలు పెట్టి నవంబరు నెలాఖరులోగా వాటిని పూర్తి చేస్తామన్నారు. సభలో గ్రామాభివృద్ధి సంఘం అధ్యక్షుడు పప్పుల మసేను వెంకన్న(రేవు శ్రీను), మాజీ సర్పంచి, భాజపా నాయకుడు కర్రి చిట్టిబాబు, గ్రామ ప్రముఖులు పెమ్మాడి సత్తిబాబు, తమ్మా వెంకటరమణ(చిన్న), జి.రామకృష్ణ, చీకట్ల రాము తదితరులు పాల్గొన్నారు. కె.గంగవరంలో విళ్ల సత్తిబాబు ఇద్దరు పిల్లలు అనారోగ్యంతో బాధపడుతున్న అంశాన్ని గమనించిన మంత్రి వాసంశెట్టి సుభాష్ తక్షణ సాయంగా రూ.10వేలు అందజేశారు. వారికి ప్రభుత్వ పరంగా పింఛను అందేలా చర్యలు తీసుకుంటానని, అప్పటి వరకూ వారి కుటుంబ అవసరాలకు తగ్గట్టుగా, పిల్లల వైద్యసాయానికి ఉండేలా నిధులు తానే ఇస్తానని ప్రకటించారు.


కోటిపల్లి సభలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్